


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి గురువారం 26-01-2023 సంపుటి : 04 సంచిక : 136 పేజీలు : 4 వెల : రూ 3-00


# ఆక్వా రైతులకు మేలు జరగాలి...

## మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చూడాలి: సీఎం జగన్



అమరావతి: పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖపై తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సమీక్ష చేపట్టారు. ఈ సమావేశం సందర్భంగా పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్యశాఖల్లో గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు ప్రగతిని సీఎం వైఎస్ జగన్‌కు అధికారులు వివరించారు. వైద్య, ఆరోగ్య శాఖలో మండలానికి రెండు పీహెచ్‌సీలు, అలాగే ప్రతి సచివాలయానికి ఒక విలేజీ క్లినిక్స్ ఈ తరహా విధానాన్ని అమలు చేస్తున్నాం. అలాగే పశు సంవర్ధక శాఖలో కూడా ఈ తరహాలోనే పటిష్టమైన అంచెల విధానాన్ని తీసుకురావాలి. యూనిఫార్మిటీ (ఏకరూపత) తీసుకురావడం ద్వారా మంచిసేవలు అందుబాటులో తీసుకురావొచ్చు. ఈ విధానాన్ని నిర్దేశించుకున్న తర్వాత నాడు–నేడు కార్యక్రమం ద్వారా మౌలిక సదుపాయాలను వృద్ధి చేయడంపై దృష్టిపెట్టాలి. దీనికి సంబంధించి ఒక హేతుబద్ధత ఉండాలి. దీనికోసం ఒక మార్గదర్శక ప్రణాళికను తయారుచేయాలి. పశువులకు వ్యాక్సినేషన్‌పై దృష్టిపెట్టాలి. లక్ష్యాలు నిర్దేశించుకుని.. ఆ మేరకు వ్యాక్సిన్లు వేయాలి. ప్రజారోగ్యానికి సంబంధించి గ్రామస్థాయిలో విలేజ్ క్లినిక్, అందులో ఏఎన్ఎం, అండగా ఆశావర్కర్లు ఇలా ఒక వ్యవస్థ జనరేట్ అయ్యింది. అలాగే ఆర్బీకేల్లో ఉన్న పశుసంవర్ధక విభాగాన్ని బలోపేతం చేయాలి. యానిమల్ హస్బెండరీ అసిస్టెంటు సమర్థతను పెంచాలి. గ్రామస్థాయిలో ఒకరిద్దరు వాలంటీర్లను ఈ సేవల్లో నిమగ్నం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. దీనికోసం ఎస్ఓపీ తయారుచేయాలన్నారు. ప్రతీ మండల స్థాయిలో ఉన్న ఈ వ్యవస్థ నుంచి ఆర్బీకేల్లో ఉన్న యానిమల్ హస్బెండరీ అసిస్టెంటుకు పూర్తిస్థాయి మద్దతు, సహకారం ఉండాలి. దీనివల్ల సంతృప్తస్థాయిలో పశువులకు తగిన వైద్యం సహా పోషణ సేవలను అందించడానికి వీలవుతుంది. పశుపోషణ చేస్తున్న వారి వద్ద కాల్‌సెంటర్ నంబర్, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ నంబర్లు అందుబాటులో ఉండాలి. ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ప్రతి పశువుకూ హెల్త్ కార్డు ఇచ్చే దిశగా ఆలోచన చేయాలి. దీనివల్ల వాటికి అందుతున్న వైద్య సేవలపై పర్యవేక్షణ సులభతరం అవుతుందని సీఎం జగన్ తెలిపారు. పశుసంవర్ధక శాఖలో ఏ స్కీం అమలు చేసినా అర్హులందరికీ అది అందాలి. ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుంటే.. అందరికీ ఆ స్కీంలు అందజేయాలి. వివక్ష లేకుండా అందరికీ స్కీంలు అందాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశించారు. జగనన్న పాలవెల్లువలో భాగంగా ఏర్పాటు చేసిన మిల్క్ సొసైటీల వద్ద అమూల్ భాగస్వామ్యంతో పాడిరైతులకు శిక్షణ ఇప్పించాలి. పాలల్లో రసాయన మూలకాలు ఉన్న ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. అలాంటి పరిస్థితులు రాకుండా చూడాలి. పాల నాణ్యత పెరగాలి. రసాయనాలకు తావులేని పశుపోషణ విధానలపై అవగాహన పెంచాలి. పశుసంవర్ధక శాఖలో అన్ని రకాల సేవల కోసం ఒకే నంబరు వినియోగించాలి. పశువుల అంబులెన్సులు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి. దీనికోసం ఎస్ఓపీ రూపొందించాలి. పశువులకు సేవల్లో దేశానికి మార్గనిర్దేశంగా నిలిచామని, దాన్ని కొనసాగించాలన్న సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఏపీలో పశువులకు వైద్య సేవలు అందిస్తున్న అంబులెన్స్ విధానంపై ఇతర రాష్ట్రాలు కూడా ఆసక్తి చూపాయని ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్రానికి పంజాబ్, ఛత్తీస్‌గఢ్, కేరళకు చెందిన అధికారులు వచ్చి సందర్శించి వెళ్లినట్టు అధికారులు తెలిపారు. వైఎస్సార్ చేయూత కార్యక్రమం ద్వారా మహిళలకు జీవనోపాధి కల్పించాలని సీఎం జగన్ తెలిపారు. ఇప్పటికే రెండు సంవత్సరాలపాటు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన అక్క చెల్లెమ్మలకు ఏడాదికి రూ.18,750 చొప్పున ఇచ్చాము. ఈ డబ్బు వారి జీవనోపాధి మార్గాలను మెరుగుపరచడానికి, ఆ మార్గాలను బలోపేతంచేయడానికి ఉపయోగపడుతుందన్నారు. పశుపోషణ సహా ఇతర జీవనోపాధి మార్గాలకోసం అవసరమైన రుణాలు మంజూరు చేయించడంలో కూడా అధికారులు దృష్టిపెట్టాలన్నారు. పశువులకు పంపిణీ చేసిన మందులను నిల్వచేయడానికి ప్రతీ ఆర్బీకేలో ఫ్రిజ్ సహా అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇక, సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు 4,765 ఏహెచ్ఏ పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నామని అధికారులు వెల్లడించారు.






# యువత భవిత కోసమే పాదయాత్ర



హైదరాబాద్, జనవరి 25, 27వ తేదీన కుప్పం నుంచి నారా లోకేష్ ప్రారంభిచనున్న యువగళం పాదయాత్రకు తల్లిదండ్రుల వద్ద నుంచి ఆశీస్సుకు తీ?కుని బయలుదేరారు. కుటుంబసభ్యులు, బంధువులు అభినందనలు తెలిపారు. మామ బాలకృష్ణ దగ్గరుండి కారు ఎక్కించారు. మొదట ఎన్టీఆర్ ఘాట్‌కు వెళ్లి నివాళులర్పించారు. ను పాదయాత్రకు బయలుదేరుతున్న సందర్భంగా ప్రజలకు లోకేష్ బహిరంగలేఖ రాశారు. విభజన అనంతరం లోటు బడ్జెట్ తో ఏర్పడిన రాష్ట్రాన్ని ఐదేళ్లలో తెలుగుదేశం ప్రభుత్వం గాడిలో పెట్టి, నవ్యాంధ్ర నిర్మాణానికి చేసిన కృషి మీకు తెలుసు. ఒక్కచాన్స్ ఇవ్వండని కాళ్లావేళ్లా ప్రాధేయపడి 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సాగిస్తున్న విధ్వంసం మీరంతా చూస్తూనే ఉన్నారు. వైసీపీ బాదుడే బాదుడు పాలనలో బాధితులు కాని వారు లేరు. కర్షకులు, కార్మికులు, కూలీలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, వృద్ధులు ...ఇలా ప్రతివర్గం మాకొద్దీ అరాచకపాలన అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రాథమికంగా పౌరులకు ఇచ్చిన ప్రశ్నించే హక్కుని వైసీపీ నేతలు హరించారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి నియంత కంటే ఘోరంగా రాక్షస పాలన కొనసాగిస్తున్నారు. ప్రశ్నించే ప్రతిపక్షంపై దాడులకు దిగారు. ప్రజల ప్రాణాలకూ రక్షణ లేదు. మహిళల మానప్రాణాలు దైవాధీనమయ్యాయి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి రాష్ట్రానికి ఆదాయం సమకూర్చే పరిశ్రమల యజమానుల్ని బెదిరించి పంపేస్తున్నారు. కొత్త పరిశ్రమలు ఎలాగూ రావడంలేదు. ఉన్నవీ తరిమేస్తున్నారు. బాధితులకు అండగా నిలుస్తున్న రాజ్యాంగ, న్యాయవ్యవస్థలపైనా మూకదాడులకు తెగబడుతున్నారు. కుల,మత,ప్రాంతాల పేరుతో విద్వేషాలు ఎగదోసి వికృత రాజకీయానికి తెరలేపారు. ప్రజలకు రక్షణ కల్పించి, శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసు వ్యవస్థను జగన్ రెడ్డి తన ఫ్యాక్షన్ పాలిటిక్స్ నడిపించే ప్రైవేటు సైన్యంగా వాడుతున్నారు. అన్నివర్గాలకు అన్యాయంచేసిన వైసీపీ ప్రభుత్వం, అన్నిరంగాలను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. మన రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. పెను సంక్షోభంలోకి ప్రజల్ని నెట్టేస్తున్న సర్కారుని తక్షణమే గద్దె దింపాల్సిందే. తుగ్లక్ నిర్ణయాలతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. వైద్య ఆరోగ్య రంగం పడకేసింది. జలవనరులశాఖ ఎంత అధ్వానంగా ఉందో కొట్టుకుపోయిన అన్నమయ్య డ్యాం, ఊడిపోయిన పులిచింతల ప్రాజెక్టు గేట్లు తేటతెల్లం చేశాయి. అప్పులు, డ్రగ్స్, రైతు ఆత్మహత్యలు, వలసల్లో మన రాష్ట్రం మొదటిస్థానంలో ఉండటం మనమంతా సిగ్గుతో దేశం ముందు తలదించుకోవాల్సిన దుస్థితి. ప్రజల ప్రాణాలు తీసే ప్రమాదకర మద్యం అమ్మడమే ఆదాయంగా భావించే జగన్ రెడ్డిలాంటి సైకో పాలనకి చరమగీతం పాడాల్సిన తరుణం ఆసన్నమైంది. ధాన్యం అమ్ముకొలేని రైతుల దైన్యం, చేసేందుకు పనిలేక వలసపోతున్న జనం, ఉద్యోగాలు దొరకక పక్క రాష్ట్రాలకు పరుగులు పెడుతున్న యువత, పెరిగిన ధరలతో నిత్యావసరాలు కొనలేని సామాన్యులు, పన్నులతో బతుకు భారమైన ప్రజలు, గంజాయికి బానిసైన పిల్లల్ని చూసి రోదిస్తున్న తల్లిదండ్రులు, సకాలంలో జీతాలు అందని ఉద్యోగులు, బిల్లులు రాని కాంట్రాక్టర్లు... ఇవన్నీ సైకో పాలన దుష్ఫలితాలు. ఈ నేపథ్యంలో బాధితుల తరపున నేను ఉద్యమించాలని నిర్ణయించుకున్నాను. సైకో పాలనలో ఇబ్బందులు పడుతున్న సకలజనుల గొంతుక నేనవుతా. మీ సమస్యలు పరిష్కారానికి అరాచక సర్కారుతో పోరాడటానికి సారధిగా వస్తున్నాను. యువతకి భవితనవుతాను. అభివృద్ధికి వారధిగా నిలుస్తాను. రైతన్నని రాజుగా చూసేవరకూ విశ్రమించను.

# లోకేష్ యువ గళం కాదు.. టీడీపీకి సర్వ మంగళం: మంత్రి రోజా

తిరుపతి: లోకేష్ యువ గళం కాదు.. టీడీపీకి సర్వ మంగళం అంటూ మంత్రి ఆర్కే రోజా ఎద్దేవా చేశారు. బుధవారం ఆమె తిరుపతిలోని వెరిటాస్ సైనిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ,



లోకేష్ పాదయాత్రపై స్పందించారు. పాదయాత్ర మొదటిరోజే లోకేష్‌కు రియాలిటీ తెలుస్తుందన్నారు.'టీడీపీని అధికారంలోకి తీసుకురావాలని పవన్ తాపత్రయం. జనసేన పార్టీ.. కన్ఫ్యూజన్ పార్టీ' అని మంత్రి రోజా వ్యాఖ్యానించారు."కావాలనే పచ్చ మీడియా లోకేష్ పాదయాత్రకు చాలా హైప్ ఇస్తున్నాయి. దశ దిశ లేకుండ ప్రజలకు ఏం చేశారో చెప్పలేని వాళ్లు పాదయాత్రలో ఏం చెప్తారు. ప్రజా సమస్యలపై సీఎం జగన్ పోరాటం చేసి పాదయాత్ర చేశారు. అధికారంలోకి వచ్చి 99 శాతం హామీలు అమలు చేశారు" అని మంత్రి అన్నారు. ఏఎన్ఆర్‌పై బాలకృష్ణ వ్యాఖ్యలు సరికాదని, ఎన్టీఆర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఎలా ఉంటుందో బాలకృష్ణ ఆలోచించాలి" అని మంత్రి రోజా అన్నారు.

# విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులలో 7వ స్థానంలో తెలంగాణ

## 14వ స్థానానికి పడిపోయిన ఆంధ్రప్రదేశ్

అమరావతి జనవరి 25 విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్డీఐ)లో ఆకర్షణలో తెలంగాణ టాప్ టెన్ లో 7వ స్థానంలో నిలవగా ఆంధ్రప్రదేశ్ 14వ స్థానానికి పడిపోయింది. కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం.. అక్టోబర్ 2019 ? సెప్టెంబర్ 2022 మధ్య రూ. 1261471 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్డిఐలు) భారతదేశానికి వచ్చాయి. ఈ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 27.87% అంటే రూ. 351330 కోట్లు మహారాష్ట్రకు తరలిపోయాయి. రూ. 293106 కోట్లతో 23.26%తో కర్ణాటక రెండో స్థానంలో నిలిచింది. చంద్రబాబు హయాంలో 2014?19 మధ్య విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ టాప్ 5లో నిలిచిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం పెట్టుబడులు ఉపాధి కల్పన కంటే ఉచిత పథకాలకు ప్రాధాన్యత ఇస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ఉచిత పథకాలతో ఆంధ్రప్రదేశ్ కూడా శ్రీలంక మాదిరిగా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవడం ఖాయమనే ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఇప్పుడు టాప్–10 రాష్ట్రాల జాబితాలో కూడా ఆంధ్రప్రదేశ్ చోటు దక్కించుకోలేదు. అక్టోబర్ 2019 – సెప్టెంబర్ 2022 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ కు రూ. 4960 కోట్ల ఎఫ్డిఐలు మాత్రమే వచ్చాయని తెలుస్తోంది. ఇది భారతదేశానికి వచ్చిన మొత్తం ఎఫ్డిఐలలో 1% కూడా కాదని చెబుతున్నారు. భారత్కు లభించిన మొత్తం ఎఫ్డిఐలలో ఇది 0.39% మాత్రమే. ఇదే సమయంలో పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రం ఇదే కాలంలో రూ.33025 కోట్ల విలువైన ఎఫ్డిఐలను పొంది దేశంలో ఏడవ స్థానంలో ఉంది. అంటే తెలంగాణ ప్రభుత్వానికి దక్కిన దానిలో ఆంధ్రప్రదేశ్ కేవలం 15% మాత్రమే దక్కిందని అంటున్నారు.

# తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలి: పవన్

విజయవాడ, జనవరి 25,జనసేన అధినేత పవన్ కల్యాణ్ విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన ప్రచార రథం వారాహికి ఆలయంలో వాహనపూజ నిర్వహించారు. అనంతరం పవన్ కల్యాణ్ తొలిసారి వారాహి వాహనం పైకి ఎక్కి ప్రసంగించారు. అక్కడి నుంచే ఆయన జనానికి అభివాదం చేస్తూ వెళ్లారు. పవన్ కల్యాణ్ దుర్గ గుడికి రావడంతో పక్కనే ఉన్న ఫ్లైఓవర్ సహా రోడ్లన్నీ జనంతో కిక్కిరిసి పోయాయి. పవన్ కల్యాణ్ ను చూసిన జనం హుషారుతో, ఉత్సాహంతో నినాదాలు



చేశారు. ఈ క్రమంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తొలుత ఆలయానికి కారులో చేరుకున్న పవన్ కల్యాణ్ దుర్గమ్మను దర్శించుకున్నారు. పవన్‌కు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఆయనతో పాటు పార్టీ కీలక నేత నాదెండ్ల మనోహర్ కూడా ఉన్నారు. గుడిలో ప్రత్యేక పూజలు చేశాక, వాహనానికి పవన్ పూజ చేయించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, గాజులు, పూలను పవన్ కళ్యాణ్ సమర్పించారు. పవన్ కళ్యాణ్ కి, నాదెండ్ల మనోహర్ కి ఆలయ మర్యాదలతో ఆలయ ఈవో భ్రమరాంబ, అధికారులు, వేద పండితులు స్వాగతం పలికారు. అమ్మవారిని అంతరాలయం గుండా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ గారికి ఆలయ ఆవరణలో వేద పండితుల ఆశీర్వచనం అందించారు. ఇంద్రకీలాద్రి కింద జనసేన ఎన్నికల ప్రచార రథం వారాహి వాహనానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మీడియాతో మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సుల కోసం ఇంద్రకీలాద్రి వచ్చానని అన్నారు. కొండగట్టులో వారాహికి పూజలు చేయించానని, ఆలయ ప్రాంగణంలో రాజకీయాలు మాట్లాడబోనని అన్నారు. ఆంధ్ర అంతా సుభిక్షంగా ఉండాలి. కొత్త లీడర్లు రావాలని ఆకాంక్షించారు. రాక్షస పాలనను తరిమికొట్టడమే వారాహి లక్ష్యం అని పవన్ కల్యాణ్ మాట్లాడారు. అనంతరం జనసేనాని మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి బయల్దేరనున్నారు. రెండు రోజుల పాటు మంగళగిరి పార్టీ కార్యాలయంలో జనసేన నేతలకు అందుబాటులో ఉండాలని భావిస్తున్నారు. నేడు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలులో వైఎస్ఆర్ సీపీ సర్కార్ అనుసరిస్తున్న వైఖరిపై పార్టీ ముఖ్య నేతలతో పవన్ కల్యాణ్ సమావేశం కానున్నారు.

# ప్రెసిడెంట్ పోలీస్ మెడల్స్ ప్రకటించిన కేంద్రం.. ఏపీకి విశిష్ట సేవా అవార్డులు

న్యూఢిల్లీ: రిపబ్లిక్ డే సందర్భంగా ప్రెసిడెంట్ పోలీస్ మెడల్స్‌ను కేంద్రం ప్రకటించింది. ఏపీకి రెండు ప్రెసిడెంట్ పోలీసు మెడల్ విశిష్ట సేవా అవార్డులు, 15 ప్రెసిడెంట్ పోలీసు మెడల్ మెరిటోరియస్ సర్వీస్ అవార్డులు దక్కాయి. తెలంగాణకు రెండు ప్రెసిడెంట్ పోలీసు మెడల్ విశిష్ట సేవా అవార్డులు, 13 ప్రెసిడెంట్ పోలీసు మెడల్ మెరిటోరియస్ సర్వీస్ అవార్డులను కేంద్రం ప్రకటించింది. కాగా, జనవరి 26న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు.. ఈసారి ఆంధ్రప్రదేశ్ శకటం ఎంపిక అయ్యింది. అనేక రాష్ట్రాల పోటీ మధ్యలో ఏపీ శకటం ప్రబల తీర్థం పరేడ్‌కు ఎంపికైంది. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకలకు మొత్తం 17 శకటాలు ఎంపికయ్యాయి. కోనసీమలో ప్రబలతీర్థం పేరుతో.. సంక్రాంతి ఉత్సవం ఇతివృత్తంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ శకటం ఈ అవకాశం దక్కించుకుంది.

# సంపాదకీయం

గురువారం 26-01-2023

## ది మోడీ క్వశ్చన్ పై తీవ్ర దుమారం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై బ్రిటిష్ వార్తా సంస్థ బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ "ఇండియా: ది మోడీ క్వశ్చన్" పై తీవ్ర దుమారం రేగుతోంది. ఈ వ్యవహారం ఇప్పుడు రాజకీయ మలుపు తిరిగింది. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సహా అనేక ఇతర పార్టీలు ఈ డాక్యుమెంటరీపై వివిధ రకాల ప్రశ్నలను లేవనెత్తుతున్నారు. ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం బీబీసీ రూపొందించిన ఈ డాక్యుమెంటరీ ప్రదర్శనను నిషేధించింది. నిజానికి "ఇండియా:క్వశ్చన్ ద మోదీ" డాక్యుమెంటరీ అనేది 2022 గుజరాత్ అల్లర్ల గురించి వర్ణించే రెండు భాగాల సిరీస్. ఈ డాక్యుమెంటరీలో ఆ సమయంలోని రాజకీయ పరిస్థితులు, మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన సంఘటనలు చూపించారు. ఈ డాక్యుమెంటరీ మొదటి ఎపిసోడ్ ను జనవరి 17వ తేదీన బ్రిటన్ లో ప్రసారం చేశారు. ఇందులో మోదీ రాజకీయాల అంశాలను ప్రస్తావించారు. ఇందులో మోదీకి వ్యతిరేకంగా చాలా విషయాల గురించి వివరించారు. ముఖ్యంగా ఈ డాక్యుమెంటరీలో గుజరాత్ అల్లర్లను ప్రస్తావిస్తూ.. ఆ కాలంలో మోదీ పాలనపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ అల్లర్లలో దాదాపు 2 వేల మంది చనిపోయారని.. గుజరాత్ అల్లర్ల అసలు కథను ఈ డాక్యుమెంటరీలో చూడొచ్చని పేర్కొన్నారు.ఈ డాక్యుమెంటరీపై భారత ప్రభుత్వం నుంచి తీవ్ర అభ్యంతరాలు వచ్చాయి. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చి ఈ డాక్యుమెంటరీని దుష్ప్రచారంలో భాగంగానే ఇదంతా చేస్తున్నారని అభివర్ణించారు. ఈ డాక్యుమెంటరీ ఏక పక్షంగా ఉందన్నారు. అందువల్లే ఈ డాక్యుమెంటరీ ప్రదర్శన నిషేధిస్తున్నామని ప్రకటించారు. ట్విట్టర్, యూట్యూబ్ ఛానెళ్లలో ఉన్న ఈ వీడియోలను బ్లాక్ చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. డాక్యుమెంటరీపై నిషేధాన్ని ప్రశ్నిస్తూ.. కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్ ఆసక్తికర కామెంట్లు చేశారు. కేంద్రప్రభుత్వం ఒక డాక్యుమెంటరీని ఎలా అడ్డుకుంటుంది, ఏది తప్పో, ఏది ఒప్పో ప్రజలనే నిర్ణయించుకోనివ్వాలని అన్నారు. 2002లో ప్రధాని వాజ్‌పేయి ఎందుకు తన పదవిని విడిచిపెట్టారని ప్రశ్నించారు. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) నాయకుడు డెరెక్ ఓబ్రెయిన్.. "ఈ డాక్యుమెంటరీ మోదీ అసలు రూపాన్ని చూపుతోందంటూ ట్వీట్ చేశారు. అయితే ఈ ట్వీట్లను తనకు సంబంధం లేకుండానే ప్రభుత్వం తొలగించిందని చెప్పుకొచ్చారు. ఈ డాక్యుమెంటరీని యూట్యూబ్, ట్విట్టర్ నుంచి తొలగించగా.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు ఈ డాక్యుమెంటరీని చూపించినట్లు తెలుస్తోంది. దీనిపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విద్యార్థి విభాగం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కూడా అధికారులకు ఫిర్యాదు చేసింది. క్యాంపస్‌లో విద్యార్థులు బీబీసీ డాక్యుమెంటరీని చూశారని ఆరోపించింది. అదే సమయంలో దీన్నిఢిల్లీలోని జేఎన్‌యులో కూడా ప్రదర్శించాల్సి ఉందని.. కానీ కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు చెబుతున్నారు. ఇకపై మైక్రోబ్లాగింగ్ మరియు వీడియో-షేరింగ్ వెబ్‌సైట్‌లలో కనిపించడం లేదు. నేరుగా బీబీసీకే కేంద్రం తన అభ్యంతరాలు వ్యక్తం చేసింది. అయితే బీబీసీ మాత్రం చాలా లోతుగా అధ్యయనం చేసి ఆ డాక్యుమెంటరీ తీసినట్లు స్పష్టం చేసింది. ఆ బీబీసీలో ఎంత నిజాలున్నాయో.. ఎన్ని అబద్ధాలున్నాయో ప్రజలు తెలుసుకోకుండా కేంద్రమే చేయడం ఆశ్చర్యకరంగా మారింది. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టక ముందు ప్రపంచంలో ఆయన ఇమేజ్ చాలా తేడాగా ఉండేది. ఆయనకు ప్రపంచంలోని ప్రముఖ దేశాలు వీసాలు ఇచ్చేవి కావు. అయితే ఆ అల్లర్లలో ఆయన పాత్ర లేదని ఇటీవలే కేంద్ర దర్యాప్తులు సంస్థలు తేల్చాయి. కానీ అంతర్జాతీయ సమాజం మాత్రం నమ్మడం లేదు. ప్రభుత్వాల రహస్య విచారణల్లో.. ఆయన పాత్ర తేలిందని బీబీసీ లాంటి వేదికలు ప్రచారం చేస్తూనే ఉన్నాయి. ఈ డాక్యుమెంటరీని నిషేధించడం వల్ల?. దీని గురించి మరింత విస్తృత ప్రచారం జరిగే అవకాశాన్ని కేంద్రమే కల్పించినట్లయింది. ఈ క్రమంలోనే హెచ్సీయూలో డాక్యుమెంటరీ ప్రదర్శనపై అధికారులు విచారణ జరుపుతున్నారు. యూనివర్శిటీ క్యాంపస్‌లో బీబీసీ డాక్యుమెంటరీ "ఇండియా: ది మోడీ క్వశ్చన్" ను ప్రదర్శించారని.. దీని విచారణ చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. మరో వైపు ప్రధాని నరేంద్ర మోదీపై తీసిన బీబీసీ డాక్యుమెంటరీ సిరీస్‌ను కేంద్ర ప్రభుత్వం నిషేధించినా వాస్తవాలను మరుగుపరచలేరని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. ప్రధాని మోదీపై బీబీసీ ది మోదీ క్వశ్చన్ పేరుతో రూపొందించిన డాక్యుమెంటరీని కేంద్రం నిషేధించిన క్రమంలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వైఖరి రక్షణాత్మక ధోరణితో ఉందని వ్యాఖ్యానించారు. ఇవి అసహన రాజకీయాలని తాను భావిస్తున్నానని చెప్పారు. సత్యాన్ని దాచలేరని, వాస్తవం వెలుగులోకి వస్తుందని పేర్కొన్న రాహుల్ మనం ప్రజాస్వామిక దేశంలో ఉన్నామని గుర్తుచేశారు. మీరు సత్యాన్ని ఎంత గట్టిగా తొక్కిపెట్టినా అది బయటకు రాకతప్పదని స్పష్టం చేశారు. ఇదే కాకుండా.. జేఎన్యూలో విద్యార్థుల బృందం ఈ డాక్యుమెంటరీని ప్రదర్శించబోతున్నట్లు తెలిసిందని సమాచారం వచ్చినట్లు వివరించారు. ఇలాంటి డాక్యుమెంటరీ క్యాంపస్‌లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తుందని జేఎన్‌యూ అడ్మినిస్ట్రేషన్ తెలిపింది.

# తెలుగుదేశంలో సీట్ల పంచాయితీ

విజయవాడ, జనవరి 25, ఇప్పటి వరకు అధికార పార్టీలోనే కనిపించిన సీన్ ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షంలో కనిపిస్తోంది. టికెట్ తమకే ఇవ్వాలంటూ ఒత్తిళ్లు అన్ని పార్టీల్లో సర్వసాధారణంగా మారిపోతున్నాయి. లేకుంటే మా తడాఖా చూపిస్తామంటూ నేతలు వార్నింగ్‌లు ఇస్తున్నారు. దీంతో పార్టీ దూతలు రంగంలోకి దిగి.. నేతలను కూల్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ పార్టీల్లో టికెట్ రేసు మొదలైపోయింది. ఇప్పటి వరకు సైలెంట్‌గా ఉన్న నేతలంతా ఇప్పుడు మీడియా ముందుకు వచ్చి తమ మనసులోని మాటను బయట పెడుతున్నారు. మొన్నటికి మొన్న వైసీపీలో ఇలాంటి సీన్స్ కనిపించాయి. మేకతోటి సుచరిత లాంటి వీరవిధేయులు కూడా ఒత్తిడి తెచ్చేలా మాట్లాడారు. ఇప్పుడు అలాంటివే తెలుగుదేశం పార్టీలో మొదలయ్యాయి. ఇటీవల కాలంలో విజయవాడ ఎంపీ కేశినేని నాని... పలు సందర్భాల్లో మాట్లాడుతూ.. పార్టీ టికెట్లపై కీలక కామెంట్స్ చేశారు. ఆ ముగ్గురికి టికెట్‌లు ఇస్తే సహకరించబోనంటూ వార్నింగ్ ఇచ్చారు. పార్టీ తనకు టికెట్ ఇవ్వకుంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేసే సత్తా కూడా తనకు ఉందంటూ సందేశాన్ని పంపించారు. ఇది పార్టీలోనే తీవ్ర దుమారాన్ని రేపింది. కేశినేని నాని టికెట్ ఇవ్వొద్దంటున్న ఆ ముగ్గురిలో తన సోదరుడు చిన్ని కూడా ఉండటం అందర్నీ ఆశ్చర్యపరిచింది. వీళ్లిద్దరికి చాలా కాలం నుంచి పడటం లేదు. ఒకరిపై మరొకరు కేసులు కూడా పెట్టుకున్నారు. నాని చెప్పిన లిస్ట్‌లో బుద్దా వెంకన్న కూడా ఉన్నట్టు సమాచారం. నాగుల్ మిరా, జలీల్‌ఖాన్‌పై కేశినేని నాని గుర్రుగా ఉన్నట్టు పార్టీలో చర్చ నడుస్తోంది. తన కుమార్తెను మున్సిపల్ ఎన్నికల్లో ఓడించడానికి వీళ్లంతా తెరవెనుక ప్రయత్నాలు చేశారని.... అందుకే వాళ్లకు టికెట్ ఇస్తే మాత్రం సహకరించేది లేదని నాని చెప్తున్నారట. తమను కాదని వాళ్లకు టికెట్ ఇస్తేమాత్రం ఓడిస్తామని సిగ్నల్స్ పంపించారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. అదే టైంలో తన కుమార్తెకు టికెట్ ఇవ్వాలని కూడా సందేశం పంపించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. పనిలో పనిగా... దేవినేని ఉమపై కూడా నాని కామెంట్స్ చేశారు. ఈ ఎన్నికల్లో ఆ వ్యక్తిని తప్పిస్తే బెటర్ అన్నట్టు మాట్లాడారు. కేశినేని నాని దుమారం ఇంకా చల్లారక ముందే ఇప్పుడు గుంటూరులో మరో ముసలం రేగింది. తెలుగుదేశం అధిష్ఠానం ముందు సీనియర్ నేత రాయపాటి సాంబశివరావు గుంటూరు జిల్లా టికెట్ల పంచాయితీ పెట్టారు. తన కుటుంబానికి రెండు టికెట్లు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. అధిష్ఠానం ముందు కూడా ఇదే ప్రపోజల్ పెట్టినట్టు సాంబశివరావు వివరించారు. కొన్ని నియోజకవర్గాల పేర్లను కూడా ప్రస్తావించారాయన. తన కుమారుడు రంగబాబును రంగంలోకి దింపుతానని..

పార్టీ ఆయనకు టికెట్ ఇవ్వనంటే తానే రంగంలోకి దిగుతానంటూ చెప్పారు. గుంటూరు జిల్లా అసెంబ్లీ సీట్లపై కర్చీఫ్ వేసిన సాంబశివరావు... నరసరావుపేట ఎంపీ టికెట్‌పై కూడా కీలకమైన కామెంట్స్ చేశారు. ఆ స్థానం నుంచి స్థానికులే పోటీ చేయాలని.. నాన్ లోకల్ క్యాండిడేట్‌ను తీసుకొస్తే మాత్రం గెలిపించబోమని స్పష్టం చేశారు. ఈ స్థానం నుంచి కడపకు చెందిన ఓ సీనియర్ నేత కుమారుడు కన్నేశారని.. ఎప్పటి నుంచో ఇక్కడ కార్యకలాపాలు జరుపుతున్నారని ప్రచారం నడుస్తోంది. అందుకే ముందు జాగ్రత్తగా రాయపాటి సాంబశివరావు ఈ వ్యాఖ్యలు చేశారని ప్రచారం జోరుగా సాగుతోంది. జనసేనతో కలిసి ఎన్నికలను ఎదుర్కోవాలని టీడీపీ అధిష్ఠానం ప్రయత్నాలు చేస్తోంది. దీన్ని గ్రహించిన నేతలు తమ సీటుకు ఎక్కడ ఎసరు వస్తుందో అని చెప్పిం ముందుగానే వార్నింగ్స్ ఇస్తున్నారు. మొన్న కృష్ణా జిల్లా, నేడు గుంటూరు జిల్లా ఇలా రోజుకో జిల్లాలో నేతల స్వరాలు సవరించుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ అధినేత చంద్రబాబు ఎలా స్పందిస్తారనేది ఆసక్తిగా మారింది.

# బాలినేనికి ఇంటి పోరు

ఒంగోలు, జనవరి 25, బాలినేని శ్రీనివాసరెడ్డి. ఏపీ రాజకీయాల్లో పరిచయం అక్కర్లేని పేరు. అధికారపార్టీలో కీలక నేతగా ఉన్న ఆయన వైసీపీ ఆవిర్భావం నుంచి జగన్ వెంటే ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా కొనసాగుతూ.. ఆ పదవిని వదులుకుని జగన్ వెంట నడిచారు. జగన్‌కు దగ్గర బంధువు కూడా. వైసీపీలో మొదటి నుంచి ముఖ్యనేతగా ఉన్న బాలినేని చక్రం తిప్పేవారు. గత మంత్రివర్గంలో విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేశారు. మంత్రివర్గ విస్తరణలో సామాజిక సమీకరణాల్లో భాగంగా మంత్రి పదవిని కోల్పోయారు. అనంతరం ఆయనకు వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్‌గా ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాల బాధ్యతలను అప్పగించారు. అయితే కారణాలు ఏవైనప్పటికీ ప్రకాశం, బాపట్ల జిల్లాల బాధ్యతల నుంచి తప్పించి తిరుపతి, కడప జిల్లాలను కేటాయించారు. అయితే బాలినేనికి మంత్రి పదవి పోవటం.. వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్‌గా సొంత జిల్లాల బాధ్యతల నుంచి తప్పించటం వెనువెంటనే జరగడంతో ఆయన ప్రత్యర్థులు రంగంలోకి దిగారు. వైసీపీలో వాసు పనైపోయిందన్న ప్రచారం మొదలు పెట్టారు.ఇటీవల బాలినేని ఏం మాట్లాడినా సంచలనంగా మారుతోంది. ఓ వివాదం అంటూ వస్తే ప్రముఖంగా ఆయనే పేరే ముందు వరుసలో ఉంటుంది. గత ఇరవై ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎన్నడూ లేనంతగా ఈసారి వివాదాలు ఆయనను వెంటాడుతున్నాయి. ఓ వివాదం నుంచి బయటకు వచ్చేలోపు మరో వివాదం ముసురుతోంది. ఆ వివాదాల్లో తన ప్రమేయం లేదని నిరూపించుకోవాల్సి రావటం.. దానికి వివరణ ఇచ్చుకోవటం బాలినేనికి పరిపాటిగా మారింది. గతంలో ఎన్నడూ లేనంతగా ప్రతిపక్షంతోపాటు స్వపక్షానికి కూడా ఆయన టార్గెట్ గా మారారు. ఆయనకు అనుచరుల వల్ల కొన్ని చిక్కులు రాగా.. ఆయన మాట్లాడిన మాటలు కొన్నిసార్లు వివాస్పదంగా మారాయి. మంత్రి వర్గ విస్తరణ సమయంలో 100 శాతం కొత్తవారికే అవకాశం అంటూ ముందుగా బాంబు పేల్చినా.. తాను క్యాసినోకి వెళ్తానని.. స్నేహితులతో పేకాట ఆడుతానని మీడియా ముందే నొక్కి వక్కానించటం అప్పట్లో సంచలనంగా మారాయి.తనను కావాలని విపక్షంతోపాటు కొందరు స్వపక్ష నేతలు టార్గెట్ చేశారని.. తనను రాజకీయంగా ఎదుర్కొనలేక తన కుమారుడు ప్రణీత్ రెడ్డిని కూడా టార్గెట్ చేస్తున్నారని మాట్లాడటం వైసీపీలోనూ చర్చ అయ్యింది. ఇవన్నీ ఒక ఎత్తు అయితే ఏదో పార్టీలో ఇచ్చే కితాబులు బాలినేనికి కొత్త తలనొప్పులు తెస్తున్నాయి. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వైసీపీలో చాలా మంది పనికిరాని వాళ్లతోపాటు బాలినేని వంటి మంచివారు ఉన్నారంటూ మాట్లాడటంతో.. మాజీ మంత్రి జనసేనలో చేరతారన్న ప్రచారం మొదలైంది. దీంతో తాను పార్టీ మారాల్సిన అవసరం లేదంటూ బాలినేని స్వయంగా వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. టీడీపీ నేతలతో ఆయన టచ్ ఉన్నరంటూ మరోసారి ప్రచారం ప్రారంభమైంది. విషయం ఆ నోటా.. ఈ నోటా పడి ఆయన వరకూ చేరటంతో దానిపైనా క్లారిటీ ఇవ్వాల్సి వచ్చింది. కొంత మంది కావాలనే తనపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. దాని వెనుక తమ పార్టీలోని తన ప్రత్యర్థులే ఉన్నారని బాలినేని వాపోతున్నారు.

తాను టీడీపీ అధినేతతో ఇటీవల మాట్లాడినట్టు ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ చేస్తున్న ప్రచారంలో నిజం లేదని స్పష్టత ఇచ్చారు.వచ్చే ఎన్నికల్లో తాను ఒంగోలు నుంచి కాకుండా మరో నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని టీడీపీ నేతలు చేస్తున్నది కేవలం ప్రచారం మాత్రమేన్నారు బాలినేని. తాను ఒంగోలు నుంచే మరోసారి పోటీ చేస్తానని బాలినేని బల్ల గుద్ది చెప్పుకోవాల్సి వచ్చింది. ఒంగోలులో తన రాజకీయ ప్రత్యర్ధి దామచర్ల జనార్దన్ కేవలం రాజకీయ లబ్ధికోసమే తనపై బురద జల్లేలా మాట్లాడుతన్నారని.. మిస్టర్ జనార్దన్ రాసిపెట్టుకో వచ్చే ఎన్నికల్లో వైసీపీ తరఫున ఒంగోలు నుంచే పోటీ చేస్తానని ఘాటుగా చెప్పారు బాలినేని. తరచూ ఏదో ఒక ఆరోపణ రావటం.. పార్టీ మారతారని ప్రచారం జరగటం బాలినేనికి ఇబ్బందిగా మారిందట.. పని గట్టుకుని ఏదో ఒక రంగా వివరణ ఇవ్వాల్సి రావటంతో ఇదేం గోలరా స్వామి అంటూ తన అనుచరుల వద్ద వాపోతున్నారట. మరి బాలినేని టీడీపీ, జనసేన పార్టీల్లోకి మారుతున్నారని ప్రచారం చేయిస్తున్నదెవరు? ఎందుకు బాలినేనిని టార్గెట్ చేస్తున్నారు? విపక్షాలకు ఉప్పందించి ఇబ్బందులు పెడుతున్నదెవరు? ప్రచారం ప్రత్యర్ధి పార్టీల పనా.. సొంత పార్టీ లోని బ్లాక్ షీప్ ల పనా? హూ ఈజ్ ద బ్లాక్ షీప్.. తెలియాలంటే కొంతకాలం వేచి చూడాలి.

# బెజవాడకు టీడీపీని ధూళిపాళ సెట్ చేస్తారా...

విజయవాడ, జనవరి 25, చాలా కాలం సైలెంట్‌గా ఉన్న కేశినేని.. సింపుల్‌గా మూడు రోజుల పాటు చేసిన రాజకీయం, కామెంట్లు పార్టీలో విపరీతమైన చర్చకు దారితీశాయనే చెప్పాలి. పైగా ఇది ఇక్కడితో ఆగదు అనే సంకేతాలు కూడా కేశినేని నాని ఇచ్చారు. దీంతో కేశినేని బాంబ్ మళ్లీ ఎప్పుడు పేలుతుందో తెలియడం లేదు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో పార్టీ అధినాయకత్వం సహా.. అందరూ క్షేత్ర స్థాయిలో వివిధ కార్యక్రమాలు రూపొందించుకుంటున్న ఈ సమయాన్ని టీడీపీ అధిష్టానం చాలా ఇంపార్టెంట్ టైమ్‌గా భావిస్తోంది. ఈ క్రమంలో కేశినేని టపాస్ బ్లాస్ట్ అయితే ఇబ్బందులు తప్పవనే చర్చ ప్రస్తుతం పార్టీ వర్గాల్లో జరుగుతోంది.బెజవాడ ఎంపీ కేశినేని నాని ఎపిసోడ్‌ను వీలైనంత త్వరగా సెట్ చేసుకుంటే బెటరని భావిస్తున్నారట టీడీపీ పెద్దలు. అలా కాకుండా.. కేశినేని నాని కామెంట్లను చూసీచూడనట్టుగా వదిలేస్తే.. పరిణామాలు వేరే విధంగా ఉండే అవకాశాలున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రత్యర్థి పార్టీలో అసంతృప్త గళం వినిపించిన మరుక్షణం? దాన్ని సర్దుబాటు చేసుకోవడమో, అది కుదరకుంటే చర్యలు తీసుకోవడమో జరుగుతుంది. కానీ 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే తాము మాత్రం చతికిలిపడిపోతున్నామని స్వపక్ష సీనియర్లు అంటున్నారు. కనీసం డామేజ్ కంట్రోల్ మెకానిజం అనేది కూడా లేకుండా వదిలేస్తే కష్టమనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. గత ఎన్నికల్లో ఫ్యాన్ గిర్రున తిరిగిన సందర్భంలోనూ నాని గెలిచారంటే? కచ్చితంగా నానిని గౌరవించుకోవాల్సిన అవసరం పార్టీకి ఉందని అంటున్నారు కొందరు సీనియర్లు. ఈ క్రమంలో నానితో సంప్రదింపులు జరిపితే బెటరనే భావన వారిలో వ్యక్తమవుతోంది. పార్టీలో కేశినేని నానితో ఎవరు సన్నిహితంగా ఉంటారో గమనించి.. వారికి సంప్రదింపులు బాధ్యత అప్పగిస్తే బాగుంటుందనే సూచనలు చేస్తున్నారట. ప్రస్తుతం విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పర్యవేక్షణ.. పరిశీలన బాధ్యతలను పార్టీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర చూస్తున్నారు. కేశినేని నానికి, ధూళిపాళ్లకు మధ్య సన్నిహిత సంబంధమే ఉంది. నాని దూకుడుకు బ్రేకులు పడాలంటే ధూళిపాళ్లే కరెక్ట్ అనే అభిప్రాయం ఉంది. కానీ ధూళిపాళ్ల మాత్రం ఈ వ్యవహారాన్ని సెట్ చేసేందుకు ఎందుకు ముందుకు రావడం లేదనే చర్చ జరుగుతోంది. నాని అడిగే ప్రశ్నలకు సరైన సమాధానాలు లేక ధూళిపాళ్ల నరేంద్ర ముందుకు రావడం లేదా? లేక అధిష్టానం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదా? అని చర్చించుకుంటున్నారు.పార్టీ హైకమాండ్ నాని కామెంట్లపై సీరియస్‌గానే ఉన్నట్టు సమాచారం. అయితే నాని కామెంట్లకు స్పందించి.. రియాక్ట్ అయితే మరింత చర్చకు, రచ్చకు దారి తీసినట్టువుతందనే భావనతో ప్రస్తుతానికి నేతలను సైలెంట్‌గా ఉండమని చెప్పినట్టు తెలుస్తోంది. ఇప్పుడు నాని బహిరంగ కామెంట్లు చేశారు కానీ.. పార్టీ అధిష్టానానికి అత్యంత సన్నిహితంగా ఉండే వ్యక్తుల వద్ద కూడా పార్టీ పెద్దలను విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలు హైకమాండ్ దృష్టికి వెళ్లాయట. దీంతో నాని విషయంలో పార్టీలోని సదరు పెద్దలు కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోందిఇటీవల పార్టీ అధిష్టానం వద్ద జరిగిన ఓ సమావేశంలో నాని ప్రస్తావన వచ్చిందట. పార్టీని, నేతలను, అధిష్టానాన్ని ఇబ్బందుల్లోకి నెట్టే విధంగా నాని కామెంట్లు చేస్తున్నారనే భావన వ్యక్తమైనట్టు తెలుస్తోంది. పార్టీలో పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జీలుగా ఉన్న వారు.. వాటిని ఎందుకు సర్దుబాటు చేయడం లేదని చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో నానిని సెట్ చేసే బాధ్యతను ధూళిపాళ్లకు అప్పజెప్పినట్టు తెలుస్తోంది. మొత్తానికి వీలైనంత వరకు నాని ఎపిసోడ్‌ను సెట్ చేయాలని, లేకుంటే ఆయనపై చర్యలు తీసుకోవాలనే తరహాలోనే చర్చ జరుగుతోంది. నానిని నేరుగా పార్టీ అధినాయకత్వమే పిలిచి మాట్లాడితే సమస్య పరిష్కారం అవుతుందనే భావన వ్యక్తమవుతోంది. మరి నాని యాక్షన్‌కు అధిష్టానం రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి.

# నవరత్నాలలో ఇళ్లు దూరం

నెల్లూరు, జనవరి 25, నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 30.30లక్షల మంది అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం భావించినప్పటికీ ఆచరణలో సుమారు 25లక్షల మందికి పైగా ఇంటి పట్టాలు రెవెన్యూ యంత్రాంగం పంపిణీ చేసింది. మరో 1,01,580 మందికి సంబంధించిన పట్టాలు మంజూరు చేసిన స్థలాలకు సంబంధించి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. మరో 50 వేల మంది లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాలు శ్మశానాలు, ముంపు ప్రాంతాల్లో ఉన్నాయని, వాటికి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని సిఎం దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో వారందరికీ నివాసయోగ్యమైన ప్రాంతాల్లో కేటాయించాలని సిఎం రెవెన్యూ అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇది ఇలా ఉంటే విజయవాడ, గుంటూరుతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పేదలకు రాజధాని ప్రాంతంలో ఇంటి స్థలాలను ప్రభుత్వం కేటాయించింది. ఈ అంశం కూడా కోర్టు పరిధిలో ఉండటంతో అర్హులకు ఇతర ప్రాంతాల్లో స్థలాలు కేటాయించక పోవడంతో ఆయా లబ్ధిదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3లక్షల మంది లబ్ధిదారులకు నేటికీ ఇంటి స్థలాలు మంజూరు కాలేదు. తక్షణమే స్థలాలు కేటాయించని వారి భూములను అన్వేషించాలని ఇటీవల సిఎం రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇది ఇలా ఉంటే నివేశన స్థలాలు కేటాయించిన వారిలో 17,929 మంది ఇళ్లు కట్టుకునేందుకు అయిష్టత వ్యక్తం చేశారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు కేటాయించేందుకు భూసేకరణ చేయడం క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులకు కత్తిమీద సాములాగా మారింది.వివిధ కారణాలు చూపుతూ రాష్ట్ర వ్యాప్తంగా లే అవుట్లు సిద్ధం చేయాల్సినవి నేటికీ 4650 వరకు ఉన్నట్లు రెవెన్యూశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో ఎన్‌టిఆర్ జిల్లాలో 2792, పల్నాడులో 22, బాపట్లలో 36, ప్రకాశంలో 956 లే అవుట్లు ఉన్నాయి.

# ఢమాలున పడిపోయిన నిమ్మధర



రాజమండ్రి, జనవరి 25,గత మాసం వరకూ ఆశాజనకంగా ఉన్న నిమ్మ ధర ఒక్కసారిగా పడిపోయింది. పంట చేతికొచ్చే సమయంలో ధర పడిపోవడంతో నిమ్మ రైతులు ఆందోళన చెందుతున్నారు. డిసెంబర్‌లో శుభకార్యాలు, మంచి ముహూర్తాలు ఉండడంతో నిమ్మకు భారీగా డిమాండ్ పెరిగింది. ఒకానొక దశలో కేజీ నిమ్మ ధర రూ.60 నుంచి రూ.80 వరకూ పలికింది. ప్రస్తుతం కేజీ నిమ్మ రూ.30 కూడా పలకడం లేదు. దాదాపుగా సగానికిపైగా రేటు పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. సాధారణంగా నిమ్మ రైతులు సంక్రాంతి సీజన్‌లో చివరి పంటను కోస్తారు. ఈ సమయంలో ప్రతి ఏడూ నిమ్మకు మంచి డిమాండ్ ఉంటుంది. వీటితో అప్పులు తీర్చుకుని తిరిగి పెట్టుబడులు పెట్టుకుని ఏప్రిల్ నాటికి పంటను సిద్ధం చేసుకుంటారు. పరిస్థితులు అనుకూలిస్తే ఎకరాకు 100 నుంచి 120 బస్తాల వరకూ నిమ్మ దిగుబడి వస్తుంది. బస్తాకు 75 కిలోల నిమ్మకాయలు ఉంటాయి. నిమ్మ రైతుల్లో ఎక్కువ మంది కౌలు రైతులే ఉన్నారు. నిమ్మ సాగుకు ఎకరం ఒక్కంటికీ ఏడాదికి రూ.60 వేల వరకూ కౌలు చెల్లించాల్సి వస్తోంది. మరో రూ.60 వేల వరకూ పెట్టుబడి అవుతోంది. అంటే కౌలు రైతులకు దాదాపు రూ.1.20 లక్షల వరకూ ఖర్చవుతోంది. గతేడాది అకాల వర్షాలు, డిసెంబర్, జనవరిలో పొగమంచు కారణంగా దిగుబడి చాలా వరకూ తగ్గిపోయింది. ఎకరాకు 50 బస్తాలకు మించి దిగుబడి రావట్లేదు. ప్రస్తుతం 75 కేజీల బస్తా మార్కెట్‌లో రూ.2,300 పలుకుతోంది. అంటే కేజీ రూ.30.60 పడుతోంది. ఈ లెక్కన రైతులకు పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉంది.తూర్పుగోదావరి జిల్లాలో రాజానగరం, సీతానగరం, కోరుకొండ, నల్లజర్ల తదితర మండలాల్లో పది వేల ఎకరాల్లో నిమ్మ సాగు జరిగేది. అకాల వర్షాలకు నిమ్మ తోటల్లో పూత పూర్తిగా రాలిపోగా, రెండేళ్లుగా కరోనా కారణంగా ఎగుమతులులేక నిమ్మ రైతులు పూర్తిగా నష్టపోయారు. ధరలు లేకపోవడం, దిగుబడులు పడిపోవటంతో అప్పులు తీర్చేందుకు పంటలు వదిలేసుకున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా నిమ్మ తోటలు వేసే వారు కరువయ్యారు. దీంతో, గతంలో నిమ్మను సాగు చేసిన రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లారు. దీంతో, రెండేళ్లలో మూడు వేల ఎకరాల్లో విస్తీర్ణం తగ్గిపోయింది. ప్రస్తుతం ఏడు వేల ఎకరాలకే పరిమితమైంది. జిల్లాలో 2,796 మంది రైతులు ఈ సాగుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సుమారు 200 మంది దళారులు నిమ్మ దిగుబడులను కొనుగోలు చేసి ఇక్కడి నుంచి విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు, అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో సతమతం

విశాఖపట్టణం, జనవరి 25, జగన్ కు వచ్చే ఎన్నికల్లో గెలుపు ముఖ్యం. రెండోసారి గెలిస్తే ప్రధానమైన ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీని రాజకీయంగా మరింత దెబ్బతీయవచ్చు. ఆ పార్టీ నేతలు, క్యాడర్ ను కూడా పక్కకు లాగేయవచ్చు. కానీ అది అంత సులువు కాదు. అందుకోసమే ప్రతి అంశంపైనా దృష్టిపెడుతున్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన వేళావిశేషం బాగాలేదు. అధికారం చేపట్టిన తొలి రెండేళ్లు కరోనాతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చితికిపోయింది. ప్రధాన మైన పోలవరం ప్రాజెక్టు పూర్తి కాలేదు. రాజధాని అన్నది లేకుండానే చేస్తూ ఐదేళ్ల పాటు నెట్టుకొచ్చారన్న విమర్శలు ఎటూ ఉండనే ఉన్నాయి. సంక్షేమం సక్రమంగానే ఉన్నా అభివృద్ధి విషయంలో మాత్రం జగన్ వ్యతిరేకతను ఎదుర్కొనక తప్పేలా లేదు. కొన్ని వర్గాల ప్రజలు ఇప్పటికే అధికార పార్టీకి దూరమయ్యారన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. ఉన్నతస్థాయి వర్గాలు, ఉద్యోగులలో తీవ్ర అసంతృప్తి ఉంది. ఇక కాపులు కూడా అంత అనుకూలంగా లేరు. బీసీ ఓట్లపైనే జగన్ నమ్మకం పెట్టుకున్నారు. వీరితో పాటు పేద, మధ్యతరగతి ప్రజలు తనకు అండగా ఉంటారన్న విశ్వాసంతో ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలలో చాలా మందిని మార్చడానికి సిద్ధపడుతున్నారు. అన్ని రకాలుగా మరోసారి అధికారం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. తనకు వాలంటరీ వ్యవస్థ వచ్చే ఎన్నికల్లో ఉపయోగపడుతుందని భావించిన జగన్ అది చాలదని భావించినట్లుంది. గెలుపు గుర్రం ఎక్కాలంటే ఇంకా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నది జగన్ ఉద్దేశ్యంగా కనిపిస్తుంది. అందుకే గృహసారథుల వంటి కాన్సెప్ట్ ను తెరపైకి తెచ్చారు. ఈ నెలాఖరులోపు గృహసారథుల నియామకం పూర్తికావాల్సి ఉంటుంది. ప్రతి యాభై ఇళ్లకు ఇద్దరు గృహసారథులను నియమించనున్నారు. వీరు తమకు కేటాయించిన గృహాలకు చెందిన ఓటర్లను మంచి చేసుకోవాలి. వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలను గుర్తించి ఈ ఏడాది కాలంలో వాటిని పూర్తి చేయాలి. పూర్తిగా పార్టీ పరంగా చేపడుతున్న నియామకం కావడంతో వారే చివరకు పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు తమకు కేటాయించిన ఇళ్లవారిని తీసుకువచ్చి ఓట్లను వైసీపీకి అనుకూలంగా వేయాల్సి ఉంటుందన్న ఆలోచనతోనే ఈ కాన్సెప్ట్ ను తెచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 5.2 లక్షల మంది గృహసారథులను నియమించాలని ఆదేశించారు. వీరితో పాటు 45 వేల మంది కన్వీనర్లను కూడా నియమించనున్నారు. అయితే ఇప్పటికే ఉన్న వాలంటీర్ల వ్యవస్థకు వీరు పోటీ అవుతారా? అన్న అనుమానమూ లేకపోలేదు. వాలంటీర్ కు, గృహసారధికి మధ్య సమన్వయం, సఖ్యత లేకుంటే అసలుకే ముప్పు ఏర్పడుతుంది.

# తూర్పుపై కన్నేసిన వైసీపీ



విజయవాడ, జనవరి 25, జవాడ తూర్పు నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టుకోసం ప్రయత్నిస్తోంది. వచ్చే 2024ఎన్నికల్లో ఎట్టి పరిస్దితుల్లోనూ తూర్పు నియోజకవర్గాన్ని కైవసం చేసుకోవాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత దేవినేని అవినాష్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అవినాష్ ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గ ఇంచార్జ్ గా ఉన్నారు. అంతే కాదు ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్ది కూడా దేవినేని అవినాష్ అని, స్వయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇటీవల నిర్వహించిన నియోజకవర్గాల సమీక్షలో స్పష్టం చేశారు. దీంతో దేవినేని అవినాష్ దూకుడు పెంచారు. నియోజకవర్గంలో పట్టుకోసం అవసరం అయిన అన్ని ప్రయత్నాల్లో ఉన్నారు. అయితే ఇదే సమయంలో అవినాష్ వివాద రహితుడిగా గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా గొడవలు, ఘర్షణలకు దూరంగా ఉండాలని తన క్యాడర్ పక్కాగా చెబుతున్నారు. నియోజకవర్గంలో 22 మంది కార్పొరేటర్లు ఉండగా, అందులో ఏడు టీడీపీ కాగా మిగిలినవి అన్ని వైసీపీ కైవసం చేసుకుంది. దీంతో వైసీపీకి ఓటింగ్ ఎక్కువగా దక్కే అవకాశం ఉందని అంటున్నారు. నియోజకవర్గంలో అత్యంత కీలకం అయిన రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి కావటం కూడా వైఎస్ఆర్సీపీకి మైలేజీని దక్కించింది. దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న కృష్ణా నది రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి కావటంతో వైఎస్ఆర్ సీపీకి ప్లస్ పాయింట్ గా మారింది. దీని వలన కొన్న వందల కుటుంబాలు కృష్ణా నది ముంపు నుంచి విముక్తి కలిగిందని అంటున్నారు. ఇక అవినాష్ విషయానికి వస్తే యువ నాయకుడు కావటం, పూర్తిగా రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి కావటంతో పాటుగా, ఎమ్మెల్యే కాకపోకయినా నియోజకవర్గంలో పనులు వేగంగా పని చేయటం, అర్హులకు పథకాలను అందించేందుకు చర్యలు తీసుకోవటం వైఎస్ఆర్సీపీకి కలిసి వచ్చే అంశంగా చెబుతున్నారు. కొండ ప్రాంతాల్లో సైతం అవినాష్ పర్యటించటం, అక్కడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవటం కలిసి వచ్చే అంశం. మంత్రి పెద్దిరెడ్డితో ఉన్న అనుబంధం కూడా అవినాష్ కు ప్లస్ పాయింట్ గా చెబుతున్నారు.దేవినేని ఫ్యామిలీ అనగానే బెజవాడలో కొంత వరకు టెన్షన్ పరిస్దితులు ఉంటాయి. గతంలో విజయవాడ కేంద్రంగా చేసుకొని రెండు కుటుంబాల మధ్య చెలరేగిన వివాదం తారా స్దాయికి చేరి రాజకీయాలను సైతం తలకిందులు చేసిన నేపద్యంలో అదే ఫ్యామిలీ నుంచి వచ్చిన అవినాష్ ఆ నింద నుంచి బయటకు వచ్చేందుకు ఇప్పటికీ విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఇక దేవినేని అవినాష్ పేరు చెప్పి ఆయన అనుచరులు చేసే దందాలు ఆయనకు ఇబ్బందిగా మారింది. గొడవలు, ఘర్షణలకు కారణం అయిన వ్యక్తులు దేవినేని అవినాష్ పేరును వినియోగిస్తున్నారు. అంతే కాదు దేవినేని అవినాష్ పేరు చెప్పి, ఆయన వద్ద ఉన్న కొందరు వ్యక్తులు ఆఖరికి కార్పొరేటర్లను సైతం, ఇబ్బందులకు గురి చేయటంలొ స్వపక్షంలో విపక్షంగా మారింది. అంతే కాదు అత్యంత కీలకమైన తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం పై దాడి ఘటనలో కూడా దేవినేని అనుచరుల పాత్ర ఉ ండటంతో , టీడీపీ నేత పట్టాభి ఇంటిపై దేవినేని అవినాష్ అనుచరులు దాడి చేయటం, వారి వీడియోలు సైతం సీసీ కెమెరాల్లో చిక్కటం కూడా మైనస్ గా మారింది. టీడీపీ నేత మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీపై హత్యా యత్నంలో కూడా దేవినేని అవినాష్ అనుచరులు ఉండటం, గాంధీ కన్ను పోవటంతో టీడీపీకి సింపథీ వచ్చింది.ఇక నియోజకవర్గ ముఖ చిత్రానికి వస్తే టీడీపీ, వైసీపీ నేతల మధ్య పోటా పోటీగా వాతావరణం ఉంది. ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కు మద్దతు ఉంది. అయితే వచ్చే ఎన్నికల్లో గద్దెను టీడీపీ అభ్యర్ధిగా గన్నవరం పంపుతారని, జనసేన పొత్తులో భాగంగా ఆ పార్టీకి సీటు వస్తుందని ప్రచారం ఉంది. అదే సమయంలో టీడీపీ నుంచి గద్దె గన్నవరం నియోజకవర్గం వెళితే, అక్కడ సీటును ఎంపీ కేశినేని నాని కుమార్తె కేశినేని శ్వేతకు ఇవ్వాలని గద్దె ప్రతిపాదనలు పెడుతున్నారని సమాచారం. దీంతో నియోజకవర్గంలో పరిస్దితులు ఎప్పుడు ఎలా మారతాయనేది చర్చనీయాశంగా మారింది.

# ఏపీ బీజేపీకి బిగ్ షాక్...



గుంటూరు, జనవరి 25, సీనియర్ రాజకీయ నేత, బీజేపీ ఏపీ మాజీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీ నారాయణ పార్టీ మారుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. పొమ్మన కుండా పొగపెడుతున్నారని, తన అనుచరులను పార్టీ పెద్దలు టార్గెట్ చేస్తున్నారని, తన వారి వద్ద అన్నారట కన్నా. ఆయన కమలం పార్టీతో కలిసి పనిచేయలేకపోతున్నారని ఇప్పటికే టాక్స్ వినిపిస్తున్నాయి. పలు సందర్భాలలో బీజేపీ నాయకులపై కన్నా చేసిన కామెంట్లు ఈ ప్రచారానికి మరింత బలాన్ని ఇస్తున్నాయి. మొత్తానికి కన్నా పార్టీ మారడం ఖాయం అంటున్నారు అయన ఫాలోవర్లు. కన్నా లక్ష్మీనారాయణ.. వంగవీటి మోహనరంగా అనుచరుడిగా, కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా, ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజనకు కొద్ది రోజుల ముందు సీఎం రేసులో కూడా ఉన్నారు కన్నా. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీ పూర్తిగా తుడిచి పెట్టుకుపోయినా 2014 ఎన్నికలలో కాంగ్రెస్ తరపున పోటీ చేశారు. ఇక ఏపీలో కాంగ్రెస్ పార్టీ వెంటిలేటర్ పై ఉన్న సందర్భాలలో అనేక పార్టీలు వైసీపీ, బీజేపీ పార్టీలు పోటీ పడి మరీ కన్నా లక్ష్మీ నారాయణను తమ పార్టీలోకి ఆహ్వానించాయి. బీజేపీ పట్టుపట్టి పార్టీలో చేర్చుకొని రాష్ట్ర అధ్యక్షుడు పదవిని అప్పగించింది. అప్పటి వరకు ప్రధాన పార్టీలతో సంబంధాలు నడుపుతూ వారి ఆదేశాలు పాటిస్తూ ఉన్న బీజేపీ నాయకులు కార్యక్రమాలలో మార్పు తెచ్చారు కన్నా. టీడీపీ, వైసీపీ నాయకులను ఢీకొట్టే స్థాయికి క్యాడర్ ను బలోపేతం చేశారు. తర్వాత కన్నా స్థానంలో సోము వీర్రాజు ఏపీ అధ్యక్షుడుగా నియమించింది బీజేపీ. అప్పటి నుంచి కన్నా లక్ష్మీ నారాయణతో పాటు పార్టీలోకి వచ్చిన నాయకులను సోము వీర్రాజు టార్గెట్ చేశారని ఆరోపణలు ఉన్నాయి. కన్నాను బలహీన పరిచేందుకు కన్నా అనుచరులను సోము వీర్రాజు టార్గెట్ ఆరోపణలు వచ్చాయి. కనీసం సమాచారం ఇవ్వకుండా కన్నా నియమించిన జిల్లా నాయకులను తొలగించి వారి స్థానంలో తన వారిని పెట్టుకున్నారని ఆరోపణలు పెద్ద ఎత్తున పార్టీని చుట్టుముట్టాయి. పార్టీలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్న కన్నా లక్ష్మీ నారాయణ పలు సందర్భాల్లో అసహనం వ్యక్తం చేశారు. పార్టీని సోము వీర్రాజు బలహీన పరుస్తున్నారని ఆరోపించారు. బీజేపీ పార్టీకి మిత్రపక్షంగా ఉన్న జనసేనను ఉపయోగించుకోవడంలో ఏపీ బీజేపీ విఫలమైందని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ లాంటి పవర్ ఫుల్ లీడర్ ను వాడుకోవడం సోము వీర్రాజు చేతకావడం లేదని స్పష్టం చేశారు. అశేష అభిమానులు ఉన్న జనసేన అధ్యక్షుడితో లైజనింగ్ లేకపోవడమే ఏపీలో బీజేపీ ఎదుగుదల లేకపోవడానికి కారణమని తెలిపారు. కన్నా జీవీఎల్ నర్సింహరావుని కూడా వదలలేదు రాష్ట్ర పరిస్థితులు అర్థం చేసుకోకుండా జీవీల్ మాట్లాడుతున్నారని, జాతీయ నాయకుడిగా రాజధాని అమరావతి అంశంలో చేసిన వ్యాఖ్యలు సరికాదని కుండ బద్దలు కొట్టారు. రాష్ట్ర నాయకత్వంపై మీడియా వేదికగా బహిరంగ యుద్ధానికి సిద్ధపడ్డారు. అవకాశం కల్పించుకొని మరీ రాష్ట్ర బీజేపీ నాయకత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఇక కన్నా పార్టీ వీడనున్నారని పెద్ద ఎత్తున మీడియాలో ప్రచారం అయితే జరుగుతున్నాయి. టీడీపీతో టచ్ లో ఉన్నారని ఒకరంటే, జనసేన తో టచ్‌లో ఉన్నారని మరొకరోజు ప్రచారం జరుగుతుంది. జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ స్వయంగా గుంటూరులో కన్నా ఇంటికి వచ్చి ఆయనతో ఏకాంతంగా చర్చించడం సంచలనంగా మారింది. కన్నా రేపో మాపో జనసేన పార్టీలో చేరడం కన్ఫాం అన్న వార్తలు వచ్చాయి. అయితే కన్నా తనను నాదెండ్ల మనోహర్ మర్యాదపూర్వకంగా కలిశారని తెలిపారు. సొంత సామాజిక వర్గానికి చెందిన కన్నా లక్ష్మీ నారాయణ లాంటి సీనియర్ నేత పవన్ కల్యాణ్ కు తోడుగా ఉంటే మరింత ఆదరణ లభిస్తోందని జనసేన భావిస్తుందని తెలుస్తోంది. ఇప్పటికే టీడీపీతో కన్నా టచ్ లో ఉన్నారని సత్తెనపల్లి, లేదా గుంటూరు పశ్చిమ నుంచి కన్నా పోటీ చేస్తారని వదంతులు వచ్చాయి. ఆ వార్తలు గురించి ఎవరు స్పందించలేదు. కాని కన్నాతో పాటు జిల్లా వ్యాప్తంగా అనుచరులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. పైగా కాపు కమ్యూనిటీ కూడా అండగా ఉంది. కన్నా జనసేనలో చేరితే బాగుంటుందని ఆయన అనుచరులు భావిస్తున్నారు. సామాజిక మధ్యమాలలో కన్నా కొండగట్టులో పవన్ ను కలిసి జనసేనలో చేరేందుకు సిద్దమయ్యారు అనే వార్తలు హల్ చల్ చేశారు. ఇవన్నీ ప్రచారమే అనితేలిపోయింది. కానీ భవిష్యత్తులో మాత్రం కన్నా జనసేనలో చేరే అవకాశం లేకపోలేదని అంటున్నారు ఆయన అనుచరులు. కన్నా లక్ష్మీనారాయణ లాంటి సీనియర్ పవన్ కు సలహాలు ఇస్తే జనసేన పార్టీకి మరింత ప్రయోజనం జరగటం ఖాయమని భావిస్తున్నారు. ఇప్పటికే కన్నా అనుచరులు బహిరంగాంగా బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు పై బహిరంగ విమర్శలు చేస్తున్నారు. పెదకూరపాడులో సమావేశం ఏర్పాటు చేసి సోము వీర్రాజుపై మండిపడ్డారు. అతని వైఖరికి విసిగిపోయామని చెబుతున్నారు. మూకుమ్మడిగా బీజేపీ పార్టీకి రాజీనామాలు చేసి పార్టీకి కోలుకోలేని షాక్ ఇచ్చారు. ఈ వ్యవహారం మొత్తం కన్నా కనుసన్నలలో జరుగుతుందని సమాచారం.

# పవన్ అలా... బీజేపీ అలా



విజయవాడ, జనవరి 25, (న్యూస్ పల్స్)పొత్తులపై పవన్ కల్యాణ్ చేస్తున్న కామెంట్స్ రాజకీయ వర్గాలను సైతం అయోమయానికి గురి చేస్తున్నాయి. బీజేపీతోనే ఉన్నామని ఉంటామని ఓ సారి చెబుతారు. ఆ పార్టీ కలసి వస్తే అని మరోసారి అంటారు. అయితే పవన్ కల్యాణ్ కొండగట్టులో తెలంగాణ గురించే మాట్లాడి ఉండవచ్చు.. కానీ బీజేపీతో పొత్తు రెండు రాష్ట్రాల్లో ఉ ంది. అదే సమయంలో భీమవరంలో జరుగుతున్న బీజేపీ ఏపీ కార్యవర్గ సమావేశాల్లో జనసేనతో పొత్తు లేదన్నట్లుగా ఆ పార్టీ వ్యవహరించింది. రాజకీయ తీర్మానంలో జనసేన ప్రస్తావన కూడా తీసుకు రాలేదు. దీంతో బీజేపీ పవన్ కల్యాణ్ ను దూరం పెట్టిందన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో ఏర్పడుతోంది. గౌరవం లేని చోట పొత్తుల ప్రస్తావనే ఉండదని గతంలో తెలంగాణలో బీజేపీ నేతలను ఉద్దేశించి పవన్ కల్యాణ్ అన్నారు. ఆ తర్వాత బీజేపీ నేతలు కూడా.. జనసేనతో తెలంగాణలో పొత్తు లేదని ఆ పార్టీతో పొత్తు.. ఏపీ వరకే పరిమితమని ప్రకటించారు. అప్పట్నుంచి తెలంగాణలో రెండు పార్టీల మధ్య పొత్తు ఉందని ఎవరూ అనుకోవడం లేదు. పవన్ కల్యాణ్ గత గ్రేటర్ ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులను కూడా ప్రకటించారు. అయితే బీజేపీ నేతలు వచ్చి అడగడంతో చివరి క్షణంలో విరమించుకున్నారు. అయితే ఆ తర్వాత బీజేపీ నేతలతో సంబంధాలు చెడిపోయాయి. ఈ కారణంగా పవన్ బీజేపీతో పొత్తు ఉండదని ప్రకటించారు. కానీ ఈ సారి మాత్రం కొండగట్టులో బీజేపీ కలిసి వస్తే పని చేయడానికి సిద్ధమయ్యారు. తమ బలం పరిమితమన్నారు. కొత్త పొత్తులకు చాన్స్ ఉ ందన్నారు. అయితే బీజేపీ మాత్రం ఎన్నికల్లో పొత్తుల్లేకుండా పోటీ చేయాలని నిర్ణయించుకుంది. జనసేన పార్టీతో పొత్తుల కోసం ఏ మాత్రం ఆసక్తి చూపించడం లేదు. ఏపీలో కూడా బీజేపీ అసలు తాము జనసేనతో పొత్తులో ఉన్నామన్న విషయాన్ని కూడా మర్చిపోయినట్లుగా వ్యవహరిస్తోంది. భీమవరంలో జాతీయ కార్యవర్గ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశాల్లో రాజకీయ తీర్మానాన్ని బీజేపీ ఆమోదించింది. అందులో ఎక్కడా .. తాము మిత్రపక్షాలతో కలిసి ఉన్నామనీ కానీ ఆ పార్టీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తామన్న వ్యాఖ్యలు చేయలేదు. వైసీపీ, టీడీపీలకు ప్రత్యామ్నాయంగా



తాము ఎదుగుతామని తీర్మానం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని.. తీర్మానించారు. టీడీపీ, వైసీపీలతో పొత్తులు పెట్టుకునే అవకాశాల్లేవని స్పష్టమయింది. మరి జనసేన విషయాన్ని ఎందుకు పట్టించుకోలేదన్నది కీలకం. జనసేన ఇటీవల ఓట్లను చీల్చబోమని.. చెబుతూ వస్తోంది. చంద్రబాబుతో రెండు సార్లు పవన్ సమావేశం అయ్యారు. బీజేపీ మాత్రం పవన్ టీడీపీకి దగ్గరయ్యారని ఫిక్సయిపోయి.. ఆ పార్టీని వీలైనంత దూరం పెట్టాలని నిర్ణయించుకున్నట్లుగా కనిపిస్తోంది. పవన్ కల్యాణ్ తెలంగాణలో ఒంటరిగా పోటీ చేయాల్సిందే. ఏపీలో టీడీపీతో పొత్తులు పెట్టుకున్నా.. తెలంగాణలో ఆ రెండు పార్టీలు పొత్తులు పెట్టుకోవడం వల్ల కలసి వచ్చే ప్రయోజనం ఏమీ ఉండదు. రెండు పార్టీల ఫోకస్ ఏపీపైనే ఉంటుంది. అయితే ఏపీలో పొత్తులు కుదురుతాయా అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. అంతర్గతంగా ఏమైనా చర్చలు జరుగుతున్నాయా లేదా అన్నది ఆయా పార్టీల వారికే తెలుసు. కానీ బీజేపీ మాత్రం.. పవన్ కల్యాణ్ కు రెండు రాష్ట్రాల్లోనూ దూరమయినట్లే. ఇప్పుడు ఏపీలో పొత్తులు పెట్టుకోవాలంటే.. టీడీపీనే ఆప్షన్. లేదంటే ఒంటరి పోటీ చేయాల్సి ఉంటుంది.

# గ్రామీణ శివారు ప్రాంతాల అభివృద్ధికి కృషి

### వైకాపా నేత కోటంరెడ్డి

నెల్లూరు , నెల్లూరు నియోజకవర్గంలో శివారు ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 24వ డివిజన్ కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డ్ లో 20 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి మేయర్ పొట్లూరు స్రవంతి తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గం లో ఎమ్మెల్యే కోటంరెడ్డికి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రాజకీయాలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో శక్తివంచన లేకుండా పనిచేస్తున్నామన్నారు. గత ప్రభుత్వాలు పట్టించుకోని ప్రాంతాలలో కూడా నేడు సిమెంట్ రోడ్లు,డ్రైనేజీ కాలువలు ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. నెల్లూరు నగర మేయర్ స్రవంతి మాట్లాడుతూ రూరల్ కు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆరవ శాంతి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అరవ శ్రీనివాసులు, అజయ్, భారతమ్మ,, హృదయ్ కుమార్, మస్తానయ్య మల్లికార్జున్, శశిధర్ రెడ్డి, రాఘవేంద్ర, ఖాదర్ బాష తదితరులు పాల్గొన్నారు

# ఎస్వీ గోశాలలో పిండమార్పిడి ప్రాజెక్టుపై ఈఓ సమీక్ష

తిరుపతి, జనవరి 25 దేశీయ గోవుల పాల ఉత్పత్తిని పెంచేందుకు, మేలుజాతి దేశవాళీ గోవులను జన్యుపరంగా అభివృద్ధి చేసేందుకు టిటిడి చేపట్టిన పిండ మార్పిడి ప్రాజెక్టుపై ఈవో ఏవి.ధర్మారెడ్డి, ఎస్వీ పశువైద్య వర్సిటీ ఉపకులపతి ఆచార్య వి.పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సమీక్ష జరిగింది. తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో గల ఈవో కార్యాలయంలో ఈ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ గోశాలలో సంతానోత్పత్తి సామర్థ్యం గల గోవులకు మేలుజాతి స్వదేశీ గోజాతుల పిండాలను మార్పిడి చేసి కృత్రిమ గర్భధారణ కలిగించి, ఆశించిన ఫలితాలు

పొందేందుకు పిండమార్పిడి విధానం దోహదపడుతుందన్నారు. దీనివల్ల అంతరించిపోతున్న భారతీయ గోజాతుల పరిరక్షణ, అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఇందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని పశువైద్య వర్సిటీ అందించాలని కోరారు. ఈ ప్రాజెక్టు కాల పరిమితి ఐదేళు కాగా, దీనిని నాలుగేళ్లకు తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా పిండ మార్పిడి ప్రాజెక్టు పురోగతిపై ఎస్వీ పశువైద్యవర్సిటీ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం గోశాలలో జరుగుతున్న ఫీడ్ ప్లాంట్ నిర్మాణంపై ఈఓ సమీక్షించారు. ఈ సమీక్షలో జెఈఓ సదా భార్గవి, ఎఫ్.ఏ సియేవో బాలాజీ, ఎస్వీ గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథ్ రెడ్డి, ఎస్వీ పశువైద్య వర్సిటీ డీన్, పిండమార్పిడి ప్రాజెక్టు ఇన్చార్జి ఆచార్య వీరబ్రహ్మయ్య, రిజిస్ట్రార్ రవి, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్ టెన్షన్ ఆచార్య వెంకటనాయుడు, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ఆచార్య సర్జన్ రావు తదితరులు పాల్గొన్నారు

# 28న విచారణకు రండి

కడప, జనవరి 25, వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ అవినాష్ రెడ్డికి సీబీఐ మరోసారి నోటీసులు జారీ చేసింది. జనవరి 28న విచారణ రావాలని పిలుపునిచ్చింది. నిన్నే మీడియాతో మాట్లాడిన అవినాష్ రెడ్డి.. సీబీఐకి సహకరిస్తామన్నారు. మరోసారి నోటీసు జారీ చేస్తే విచారణకు వెళ్తామన్నారు. తన ఇంట్లోనే హత్యకు గురైన మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి మర్డర్ కేసులో ఇప్పటికే ఎంపీ అవినాష్ రెడ్డి రెండు రోజుల క్రితం నోటీసు ఇచ్చింది. దానిపై స్పందించిన అవినాష్ రెడ్డి... తాను ఇప్పటికిప్పుడంటే రాలేనంటూ సమాధానం ఇచ్చారు. తనకు ఐదు రోజుల పాటు ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలు ఉన్నాయని రిప్లై ఇచ్చారు. 24వ తేదీ విచారణ రాలేనంటూ తేల్చేశారు. దీంతో మరోసారి సీబీఐ నోటీసులు జారీ చేసింది. 28న విచారణ హాజరుకావాలని సూచించారు. రెండోసారి నోటీసు ఇచ్చిన సీబీఐ ఇచ్చిన గడువు నాటికి అవినాష్ చెప్పిన ఐదు రోజుల షెడ్యూల్ పూర్తవుతుంది. అందుకే 28న విచారణకు రావాలని సీబీఐ కాల్ చేసినట్టు తెలుస్తోంది. ఇప్పుడు విచారణకు ఆయన వెళ్తారా లేకుంటే మరేదైనా కారణం చెప్తారా అనే సస్పెన్స్ నెలకొంది. ఈ సీబీఐ ఎంక్వయిరీపై స్పందించిన అవినాష్ రెడ్డి... గత రెండున్నర సంవత్సరాలుగా తనపై, తన కుటుంబంపై ఒక సెక్షన్ ఆఫ్ మీడియా అసత్యపు ఆరోపణలు చేస్తోందని అన్నారు. తనపై వచ్చిన అభియోగాలను జీర్ణించుకోలేకపోతున్నానని అన్నారు. తన గురించి, తన వ్యవహార శైలి ఏంటో ఈ జిల్లా ప్రజలు అందరికీ బాగా తెలుసని అన్నారు. "న్యాయం గెలవాలి. నిజం వెల్లడి కావాలి అన్నదే నా ధ్యేయం. నిజం తేలాలని నేను కూడా భగవంతుడిని కోరుకుంటున్నా. ఆరోపణలు చేసేవారు మరొకసారి ఆలోచించాలి ఇలాంటి ఆరోపణ చేస్తే మీ కుటుంబాలు కూడా ఎలా ఫీల్ అవుతారో ఒకసారి ఊహించుకోండి" అని అన్నారు.జనవరి 23న మధ్యాహ్నం సీబీఐ అధికారులు పులివెందులకు వచ్చి సీబీఐ నోటీసులు ఇచ్చారు. జనవరి 24న మధ్యాహ్నం సీబీఐ విచారణకు రావాలని ఆదేశించారు. కానీ, ముందే ఖరారైన కార్యక్రమాలు ఉన్నందున విచారణకు నాలుగైదు రోజులు గడువు కావాలని సమయం కోరాను. మళ్లీ వారు ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్లి, అధికారులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్తాను. గడిచిన రెండున్నర సంవత్సరాలుగా విపరీతంగా నాకు, నా కుటుంబానికి పరువు నష్టం కలిగింది. ఇంకా కోర్టులో విచారణ మొదలు కాకపోయినా ఒక సెక్షన్ మీడియా నన్ను విపరీతంగా డీఫేమ్ చేసింది. నన్ను నా వాళ్లను విపరీతంగా బాధపెట్టారు. కానీ, నేను ఏమీ మాట్లాడలేదు. ఈ సబ్జెక్ట్ పైన మాట్లాడాలంటేనే నా మనస్సు ఒప్పుకోవడం లేదు. నేను ఏంటో నా వ్యక్తిత్వం ఏంటో ఈ జిల్లా ప్రజలకు బాగా తెలుసు. న్యాయం గెలవాలి, నిజం ఏంటో బయటకు రావాలి. నిజం బయటకు రావాలని అందరూ దేవుణ్ని కోరుకోండి. మీడియాకు కూడా ఇదే చెప్తున్నా. అంతేకానీ, సొంత వ్యాఖ్యానాలు రాయొద్దని కోరుతున్నా." అని వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు.

# 13 వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ

మచిలీపట్నం స్థానిక మచిలీపట్టణం లో 13 వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ ఆధ్వర్యంలో లక్ష్మీ టాకీస్ సెంటర్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు అవగాహన సదస్సు ర్యాలీని నిర్వహించారు. తరువాత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 13 వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు, సీనియర్ ఓటర్లను సత్కరించారు. బాలబాలికలకు అవగాహన సదస్సులను నిర్వహించారు. విద్యార్థినులతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపరాజితా సింగ్ , డి ఆర్ వో వెంకటేశ్వర్లు , మున్సిపల్ కమిషనర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# మచిలీపట్నం మూడు స్థంబాల సెంటర్ లో టిడిపి వైసిపి ఫ్లెక్స్ ల వివాదం

మచిలీపట్నంమచిలీపట్నం మూడుస్తంభాల సెంటర్ లో గల టీడీపీ ఫ్లెక్సలను ఈ రోజు ఉదయం తొలగించమని మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు అని కొందరు మున్సిపల్ కార్మికులు మూడు స్తంభాల సెంటర్ లో ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సలను తొలగించడానికి వచ్చారు. మున్సిపల్ అధికారులు, పోలీసులు లతో టిడిపి అధికారులు వాదోపవాదానికి దిగారు. మొదట వైసీపీ ఫ్లెక్సలు తొలగించండి మా ఫ్లెక్సలను మేమే తీసాస్తం అని పోలీస్ అధికారులతో, వైసీపీ వాళ్లకి ఒక న్యాయమా అని అని టీడీపీ అధికారులు, నాయకులు మండి పడ్డారు.

# విద్యార్థి మిస్సింగ్

తిరుపతి తిరుపతి జిల్లా చిల్లకూరు మండల కేంద్రమైన చిల్లకూరు గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి దినేష్ ఈనెల 23వ తేదీ నుండి కనబడడం లేదని చిల్లకూరు పోలీస్ స్టేషన్ లో ఆ పాఠశాలకు చెందిన లెక్చరర్ వెంకటేశ్వర్లు 24వ తేదీ ఫిర్యాదు చేశారు . ఆ ఫిర్యాదు ఆధారంగా చిలుకూరు పోలీసులు విద్యార్థి దినేష్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు .: తిరుపతి జిల్లా గూడూరు మండల పరిధిలోని తిప్పవరంపాడుతిప్పవరప్పాడు గ్రామానికి చెందిన రమణయ్య , లక్ష్మీ దంపతుల కుమారుడు దినేష్ చిల్లకూరు గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బైపిసి మొదటి సంవత్సరం చదువుతున్నాడు . విద్యార్థి దినేష్ ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం నుండి కనబడకపోవడంతో 24వ తేదీ పాఠశాలకు చెందిన లెక్చరర్ వెంకటేశ్వర్లు విద్యార్థి కనబడడం లేదని చిల్లకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు . బుధవారం చిల్లకూరు ఎస్సై గోపాల్ మీడియాతో మాట్లాడుతూ పాఠశాల లెక్చరర్ వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు స్టూడెంట్ మిస్సింగ్ కేసు నమోదు చేసి ప్రత్యేక బృందం విద్యార్థి దినేష్ ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు .

# బ్యాక్ వాటర్ లో అక్రమ చేపల వేట



చర్యలు తీసుకోవాల్సిన వారు ఎప్పుడో చేతులెత్తేశారు

అక్రమ చేపల వేట లో దేవాదాయ శాఖ ఉద్యోగి

నిషిద్ధ వలలతో చేపల వేటతిలాపాపం తలా పిడికెడు

బద్వేల్ కేంద్రంగా ఎంతోకాలంగా సాగుతున్న చేపల వేట

బద్వేలు , బద్వేలుకు పొరుగునే ఉన్న గోపవరం మండలం సోమశిల ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ లో చాలా కాలంగా అక్రమ చేపల వేట సాగుతుంది బద్వేల్ కేంద్రంగాకొందరు వ్యక్తులు ఈ దందాను కొనసాగిస్తూ కోట్ల రూపాయలు వెనక వేసుకుంటున్నారు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎప్పుడో చేతులు ఎత్తేశారు చేపల వేట నిషిద్ధ కాలంలో సైతం వీరి అక్రమ చేపల వేట కొనసాగుతుంది ఇది అందరికీ తెలిసిన రహస్యమే అక్రమ చేపల వేట సాగించేవారు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ లో ఉండడం సర్వసాధారణమైంది అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులు ఒత్తుతూ చేపల వేట సాగిస్తున్నారు ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే నిషిద్ధ వలలతో చేపల వేట సాగుతుంది ఎంతో బహిరంగంగా జరుగుతున్న చేపల వేట పై అధికారులు చర్యలు తీసుకున్న పాపాన పోలేదు నిషిద్ధ వలలతో చేపలు పట్టి వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి ప్రతి సంవత్సరం కోటానుకోట్ల రూపాయలు గడిస్తున్నారు ఈ వ్యవహారం చాలా సంవత్సరాలుగా జరుగుతుంది సోమేశిల జలాశయంలో స్థానిక మత్స్యకారులు చేపలు పట్టి జీవనం సాగిస్తూ ఉంటారు ఈ ముసుగులో కొందరు విశాఖపట్నం శ్రీకాకుళం కాకినాడ తదితర ప్రాంతాల నుంచి మత్స్యకారులు రప్పించి అక్రమాలకు తెర తీశారు నిషిద్ధ ఆలివ్ వలలను ఉపయోగించి చిన్న చేపలను గుడ్డు దశలోనే ఒడ్డుకు పడేస్తున్నారు దీంతో మత్స్యకారులకు ఉపాధి కోల్పోతున్నారు అక్రమార్కులకు అధికార పార్టీ నేతల అండదండలు ఉండడంతో ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారు చేపల వేట నియంత్రించ వలసిన అధికారులు అక్రమ చేపల వేట చేసే వారి వద్ద పెద్ద మొత్తంలో ముడుపులు దండుకొని వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మౌనం వహిస్తున్నారు ఇది కూడా అందరికి తెలిసిన బహిరంగ రహస్యమే పెన్నా నది పై నెల్లూరు జిల్లాలో సోమశిల జలాశయం నిర్మించినప్పటికీ నీటి నిలువ ప్రాంతం కడప జిల్లాలో ఉంది జలాశయంలో ప్రతి సంవత్సరం మత్స్యశాఖ చేప పిల్లలు వదులుతుంది ఈ జలాశయానికి పది కిలోమీటర్ల దూరంలో ఉండే మత్స్యకారులు నిరుపేదలు వారికి చేపల వేట తప్ప మరో ఉపాధి లేదు వారికి మత్స్యశాఖ అధికారులు అనుమతులు ఎప్పుడో ఇచ్చారు జిల్లాలోని గోపవరం ఒంటిమిట్ట నందలూరు మండలాలకు చెందిన దాదాపు 200 మంది పైగా మత్స్యకారులకు అధికారులు లైసెన్సులు ఇవ్వడం జరిగింది హైకోర్టు ఆదేశాల మేరకు స్థానికేతరులు కూడా కొంతమందికి లైసెన్సులు ఇచ్చారు నిబంధనల ప్రకారం స్థానిక వలలతో చేపలు పట్టి వాటిని అమ్మి జీవనం సాగించాలి కానీ దానికి పూర్తి విరుద్ధంగా చేపల వేట ఇక్కడ సాగుతుందిసోమశిల జలాశయం అడ్డాగా బద్వేలు ఒంటిమిట్ట కడప ప్రాంతాల చెందిన చేపల లైసెన్స్ కాంట్రాక్టర్లు మరి కొంతమంది వ్యాపారులు మత్స్య మాఫియా నడుపుతున్నారు ఇది కూడా అందరికీ తెలిసిన విషయమే నిబంధనలు ఎప్పుడో సోమేశిల జలాశయంలో తొక్కేశారు కాకినాడ విశాఖపట్నం శ్రీకాకుళం జిల్లాల నుంచి ఎంతో ప్రసిద్ధి పొందిన మత్స్యకారులను ఇక్కడికి తీసుకువచ్చి వారి చేత అక్రమంగా చేపలు పట్టిస్తున్నారు ఇతర జిల్లాల నుంచి ఇలా రప్పించిన మత్స్యకారులను స్థానికంగా నివాసాలు ఏర్పాటు చేసి వారి ద్వారా అక్రమ చేపల వేట సాగిస్తున్నారు అక్రమ చేపల వేట సాగించేవారికి స్థానికంగానే ఆధార్ కార్డులు ఏర్పాటు చేయడం విశేషం కొంతమంది రెవెన్యూ అధికారులు సిబ్బంది వీరికి అన్ని విధాల సహకారం అందిస్తున్నారు ముఖ్యమైన విషయం ఏమిటంటే బద్వేలు దేవాదాయ శాఖలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి అక్రమ చేపల వేటలో ప్రధాన పాత్ర వహిస్తున్నట్లు సమాచారం ఈ విషయాన్ని దేవాదాయ శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు బహిరంగంగానే చెబుతుండడం విశేషం అక్రమ చేపల వేట చేస్తున్న వారిలో దాదాపు 80 శాతం మందికి ఎటువంటి లైసెన్సులు లేవు ఆగస్టు చివరి వరకు జలాశయం లో ఎలాంటి చేపల వేట జరగకూడదని మత్స్యశాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు కానీ జలాశయంలో చేపల వేట సాగుతూనే ఉంది అధికారులు మొక్కుబడిగా దాడులు చేస్తూ మమ అనిపిస్తున్నారు అక్రమంగా పట్టిన చేపలను పెద్ద పెద్ద వాహనాల ద్వారా బద్వేలు కు తీసుకువచ్చి ఇక్కడ నుండి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు ఆలివ్ వలలుఉపయోగించడంతో పెద్ద పెద్ద చేపలు తో పాటు గుడ్డు దశ లో ఉన్న చేపలు కూడా ఈ వలలకు చిక్కుతుంటాయి మత్స్యశాఖ వదిలిన షీట్ చేప పిల్లలు ఒడ్డున పడి గిలగిల కొట్టుకోవాల్సిందే ఈ వలలకు టన్నులకొద్దీ చేపలు చిక్కుతుంటాయి చేప సైజును బట్టి కిలో 40 నుండి 50 రూపాయల వరకు చెల్లిస్తారు వారు బయట మార్కెట్లో రెండింతలకు అమ్ముకుంటారు ఇక్కడ నుండి గుజరాత్ అహ్మదాబాద్ ఢిల్లీ పశ్చిమ బెంగాల్ హౌరా మహారాష్ట్ర కర్ణాటక తదితర ప్రాంతాలకు వీటిని అక్రమంగా రవాణా చేస్తుంటారు ఈ వ్యాపారం ప్రతిఏటా కొన్ని కోట్ల రూపాయల్లో సాగుతుంది ఇలా జరిగే వ్యాపారానికి ఎలాంటి లెక్కలు ఉండవు చేపల కాంట్రాక్టర్లకు అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉండటంతో వీరి అక్రమ వ్యాపారాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలకు వీరు గులాం అవుతారు

# ప్రజాస్వామ్య వ్యవస్థలో వజ్రాయుధం లాంటిది ఓటు

నంద్యాల :- నంద్యాల పట్టణంలో బుధవారం నాడు ఓ ప్రకటనలో పి. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. ఐదేళ్లకు ఒకసారి పాలకులను ప్రజలే స్వయంగా ఎన్నుకుంటారు. అందుకే దేశంలో ఓటరుకు ఓప్రత్యేక స్థానం ఉంది. తన ఓటు హక్కుతో నచ్చినవారిని అందలం ఎక్కించగలరు. నచ్చకపోతే పదవిలో నుంచి దింపేయగలరు. ఎంతో విలువైన ఈఓటు ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం వంటింది.18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు అనే బ్రహ్మాస్త్రంతో శాసించగలిగే హక్కును భారత రాజ్యాంగం మనకు కల్పించింది. ఓటు వేయకపోవడం నిరసన తెలపడం కాదు.. లొంగిపోవడం' ప్రతి పౌరుడి ఓటు నవ భారతాన్ని నిర్మిస్తుంది. భారతదేశం పురోగతి మరియు అభివృద్ధి ఓటర్ల ఓటు ద్వారా నిర్ణయించడం జరుగుతుంది. ఒక దేశంలో బాధ్యతాయుతమైన పౌరులుగా, ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి. ఓటు ప్రజాస్వామ్య వ్యవస్థకు ఊపిరి. నేడే మీ ఓటును నమోదు చేసుకోండి.ప్రజాస్వామ్యం ఎన్నికలపైనే ఆధారపడి ఉంటుంది. ఉన్నత విలువలతో కూడిన ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సినది రాజకీయ నేతలే. అలాంటి నేతలను ఎన్నుకొనేది ఓటర్లే. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు అవ్వాలి. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ఒక ఆయుధం. దానిని సక్రమంగా ఉపయోగిద్దాం. ప్రజలు, యువత ఓటు హక్కును వినియోగించుకుని రాజ్యాంగాన్ని గౌరవించుకుని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం. ఓటు హక్కును వినియోగించుకుందాం!!ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం మనవంతు పాత్ర పోషిద్దాం!! ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ఒక ఆయుధం. దానిని సక్రమంగా ఉపయోగిద్దాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం అని ఆయన అన్నారు.

# బాలికలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

## సర్పంచ్ పాల్ దినకర్ఘనంగా జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు

కౌతాళం :-ఆడపిల్లల చదువును మధ్యలో మాన్పించి వేయకుండా నిరంతరాయంగా విద్యనభ్యసించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల నాయకులు,ప్రహ్లాదఆచారి సర్పంచ్ పాల్ దినకర్ కోరారు. మంగళవారం కస్తూర్ గాంధీ బాలికల విద్యాలయము నందు సీడీపీఓ నిర్మలా దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలిక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలోసర్పంచ్ పాల్ దినకర్ నాయకులు ప్రహ్లాద ఆచారి మరియు నాయకులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రంగాలలో మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలకు కూడా సమానమైన అవకాశాలు కల్పించాలని .మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబమే సంతోషంగా ఉంటుందని నిర్మలా దేవి ఉదహరించారు. ఐసిడిఎస్ లీలావతి మాట్లాడుతూ మహిళల సంరక్షణ కోసం చేపడుతున్న పథకాలను వివరించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో రీచ్ కార్యక్రమం ద్వారా బాల్య వివాహాలను అరికట్టడం, రక్తహీనతను అధిగమించే మార్గాలపై జిల్లా వ్యాప్తంగా మహిళల్లో, బాలికల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.తదుపరి పాఠశాలల బాలికలకు ఎక్సమ్ ప్యాడ్ నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అంతకుముందు వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సక్కిరి తిక్కయ్య, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, వడ్డే రామన్న, చౌదరి బసవ, ఈరన్న, ఏంజివ్ గౌస్ బాష, ముఖేష్, ఐసీడీఐ పర్యవేక్షకురలు లీలావతి, శివ లింగమ్మ, గోవిందమ్మ, జయలక్ష్మి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల వృత్తిపై పన్నును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

ఎమ్మిగనూరు ఎమ్మిగనూరు పట్టణంలోజర్నలిస్ట్ ల వృత్తిపై ప్రభుత్వం విధించిన పన్ను ను ఉపసంహరణ చేసుకోవాలని కోరుతూ ఏపీడబ్ల్యూజేఎఫ్, జర్నలిస్టుల యూనియన్ ఎమ్మిగనూరు తాలూక వారి అద్వర్యంలో వినతి పత్రం అందజేత.13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సంధర్భంగా ఎమ్మిగనూరు తహసీల్దార్ జయన్న నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిధి గా ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్,మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, రావడం జరిగింది అందులో భాగంగా సబ్ కలెక్టర్ కు జర్నలిస్టులు వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్,జర్నలిస్టు తాలూకా అధ్యక్షులు షబ్బీర్ యూనియన్ సభ్యులతో కలిసి సబ్ కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందిస్తూ రాష్ట్రంలో విలేఖరులకు భద్రత, జీతభృత్యలు లేకపోయిన ప్రజలకు ప్రభుత్వాలకు వారతులుగా ఉండే విలేఖరుల వృత్తి పై పన్ను ను విధించడం అన్యాయం అని వెంటనే ఈ చర్యనుప్రభుత్వం ఉపసంహరణ చేసుకోవాలని సబ్ కలెక్టర్ ను కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు తాలూకా.గౌరవ అధ్యక్షులు యూకే చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు .వెంకటేష్,సేక్రెటరీ దేవిశంకర్ ట్రెజరరీ,ఖాదర్ బేగ్, నర్సన్న,రాజ్ కుమార్ నాయుడు, సురేంద్ర,ఇబ్రహీం, ఇలియస్,మునీర్,మురళి, తదితరులు పాల్గొన్నారు..



# నాటు నాటు మాత్రమే కాదు.. ఈ రెండూ ఆస్కార్ బరిలోకి?




అందరూ ఊహించిందే నిజమైంది రాజమౌళి తెరకెక్కించిన ఆర్ఆర్ఆర్ సినిమా నాటు నాటు సాంగ్ ఒక చరిత్ర సృష్టించింది. ఈ సాంగ్ బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో 95 వ ఆస్కార్ అవార్డులకు నామినేట్ అయింది. అయితే ఆస్కార్ అవార్డుల బరిలో మరిన్ని కేటగిరీలలో కూడా ఈ సినిమా నిలుస్తుంది అనుకుంటే కేవలం ఒక్క ఒరిజినల్ సాంగ్ క్యాటగిరిలో మాత్రమే నామినేట్ అయింది. అయితే ఈ సంగతి అలా ఉంచితే తెలుగు నుంచి కాదు కానీ ఇండియా నుంచి మరో రెండు సినిమాలు ఆస్కార్ అవార్డులకు నామినేట్ అయ్యాయి.ఆల్ దట్ బ్రీత్స్ అలాగే ఎలిఫెంట్ విస్పరర్స్ అనే సినిమాలు కూడా బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిలిం బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిలిం క్యాటగిరీలలో నామినేట్ అయ్యాయి. ఆల్ దట్ బ్రీత్స్ అనే డాక్యుమెంటరీని షౌనాక్సేన్ తెరకెక్కించగా ఎలిఫెంట్ ఫీజు అనే డాక్యుమెంటరీని కార్తికి గోన్ సాల్వ్ తెరకెక్కించారు. అయితే ఇండియా నుంచి అఫీషియల్ ఎంట్రీగా ప్రభుత్వం తరపున నామినేట్ చేయబడిన చెల్లో షో సినిమా మాత్రం ఎటువంటి కేటగిరీలో కూడా నామినేట్ అవ్వలేదు ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిలిం క్యాటగిరిలో ఈ సినిమా నామినేట్ అవుతుందని భావించారు కానీ ఆ అవకాశం దక్కలేదు.ప్రస్తుతానికి ఇండియా నుంచి ఆర్ఆర్ఆర్ నుంచి నాటు నాటు ఆల్ దట్ బ్రీత్స్ అలాగే ఎలిఫెంట్ విస్పరర్స్ అనే సినిమాలకు మాత్రమే అవకాశం దక్కింది మార్చి 13వ తేదీన జరగబోతున్న ఆస్కార్ అవార్డుల ప్రధానోత్సవం లో వీటిలో ఏ సినిమాలకు ఆస్కార్ వహిస్తుంది అనేది చూడాల్సి ఉంది. అయితే ఆర్ఆర్ఆర్ సినిమాలో తెరకెక్కిన నాటు నాటు సాంగ్ కచ్చితంగా అవార్డు లభిస్తుందని అందరూ భావిస్తున్నారు.కీరవాణి స్వరపరిచిన ఈ పాటకు రాహుల్ సిప్లిగంజ్ గాత్రం అందించగా చంద్రబోస్ సాహిత్యం అందించారు ఇక సాంగ్ మాత్రమే కాదు వీడియో విజువల్స్ కూడా ప్రేక్షకులందరినీ విపరీతంగా ఆకట్టుకున్నాయి. కొన్నాళ్ల క్రితం అయితే విపరీతంగా ఈ సాంగ్ గురించి రీల్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ వచ్చాయి.

# ఈ కుర్ర హీరోలందరికీ హిట్ పడాల్సిందే

ఓ వైపు మన స్టార్ హీరోలు పాన్ ఇండియా రేంజ్ లో సక్సెస్ అవుతూ దూసుకుపోతున్నారు. తెలుగు సినిమా మార్కెట్ రేంజ్ కూడా ప్రస్తుతం పెరిగింది. వందల కోట్ల బడ్జెట్ తో సినిమాలు తీసే స్థాయికి మన నిర్మాతలు వెళ్ళారు. అలాగే మన స్టార్ హీరోలైన రామ్ చరణ్ ప్రభాస్ బన్నీ తారక్ మహేష్ బాబు పవన్ కళ్యాణ్ లాంటివారు వంద కోట్ల రెమ్యునరేషన్ తీసుకునే మార్కెట్ రేంజ్ ని పెంచుకున్నారు. ఇక సీనియర్ స్టార్స్ అయిన చిరంజీవికి పాన్ ఇండియా మార్కెట్ లేకపోయిన తెలుగులోనే వందల కోట్ల కలెక్షన్స్ చేసే సినిమాలు చేస్తున్నారు. అయితే టైర్ 2 హీరోలుగా ఉన్న యంగ్ స్టార్స్ మాత్రం సక్సెస్ కోసం పాట్లు పడుతున్నారు. వరుణ్ తేజ్ కి స్టార్ హీరో ఛాన్స్ లు దగ్గరగా ఉన్నాయి.అయితే అతని చివరి సినిమా గని డిజాస్టర్ అయ్యింది. ప్రస్తుతం ప్రవీణ్ సత్తరు దర్శకత్వంలో చేస్తున్న గాండీవదారి అర్జున మూవీతో కచ్చితంగా హిట్ కొట్టాల్సిందే ఇక హీరో రామ్ చాలా కాలంగా ఉన్న టైర్ 2 హీరోల జాబితాలోనే ఉండిపోయాడు. కమర్షియల్ హీరోగా తనని తాను ఎస్టాబ్లిష్ చేసుకోవడంలో తడబడుతున్నారు. అయితే ఇప్పుడు బోయపాటి శ్రీను దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాతో గట్టి హిట్ కొట్టాలని కసిగా ప్రయత్నం చేస్తున్నాడు. రామ్ నుంచి చివరిగా వచ్చిన ది వారియర్ మూవీ డిజాస్టర్ అయ్యింది.ఇక నితిన్ కూడా కెరియర్ లో ఎత్తుపల్లాలు చూస్తూ టైర్ 2 హీరోల జాబితాలో కొనసాగుతున్నాడు. అతని నుంచి చివరిగా వచ్చిన మూడు సినిమాలు డిజాస్టర్ అయ్యాయి. చివరిగా మాచర్ల నియోజకవర్గం కూడా ఫ్లాప్. అయితే ప్రస్తుతం వక్కంతం వంశీ దర్శకత్వంలో పీరియాడికల్ బ్యాక్ డ్రాప్ కథతో సినిమా చేస్తున్నాడు.దీంతో హిట్ కొట్టాలని కసిగా పని చేస్తున్నాడు. ఇక అక్కినేని నాగార్జున నట వారసుడిగా వచ్చిన అఖిల్ కెరియర్ లో ఇప్పటి వరకు చేసిన చేసిన నాలుగు సినిమాలు అతనికి ఆశించిన సక్సెస్ ని ఇవ్వలేకపోయాయి. కెరియర్ ఆరంభం అయిన తర్వాత సరైన సక్సెస్ లేకపోయిన అఖిల్ కి మంచి క్రేజ్ ఉంది. అయితే ఈ సారి ఆ క్రేజ్ కి తగ్గ హిట్ ఏజెంట్ తో కొడతాడని అందరూ ఆశిస్తున్నారు. పాన్ ఇండియా రేంజ్ హీరోగా ఈ సినిమాతో ఎస్టాబ్లిష్ చేసుకునే ఛాన్స్ అతనికి వచ్చింది. మరి దీనిని ఎలా యూజ్ చేసుకుంటాడు అనేది చూడాలి. ఇక సాయి ధరమ్ తేజ్ 2019లో చిత్రలహరి ప్రతిరోజు పండగే సినిమాలతో హిట్ కొట్టాడు. ఆ తరువాత చేసిన మూడు సినిమాలు ఆశించిన స్థాయిలో అతనికి సక్సెస్ ఇవ్వలేదు.డిఫెరెంట్ కథాంశంతో వచ్చిన రిపబ్లిక్ మూవీ కూడా ఎవరేజ్ టాక్ తెచ్చుకుంది. కమర్షియల్ సక్సెస్ మాత్రం కాలేదు. ప్రస్తుతం విరూపాక్ష అనే సినిమాని తేజ్ చేస్తున్నాడు. దీంతో సూపర్ హిట్ కొడతానని గట్టి నమ్మకంతో ఉన్నాడు. అలాగే గోపీచంద్ కూడా రామబాణం అనే సినిమా ప్రస్తుతం చేస్తున్నాడు. ఈ మూవీతో అతను కచ్చితంగా హిట్ కొట్టి తీరాల్సిందే. ఇలా యువ హీరోలు అందరికి ఈ ఏడాది కచ్చితంగా హిట్స్ పడాల్సిన టైమ్ వచ్చింది. మరి వారికి ఈ ఏడాది అనుకూలిస్తుందా లేదా అనేది చూడాలి.




# బాక్సాఫీస్ వార్.. థియేటర్లలో జాతరేనా?

సంక్రాంతి సీజన్ తో బిగ్ వార్ పూర్తయింది. త్వరలో సమ్మర్ వార్ ప్రారంభం కాబోతోంది. ఇదిలా వుంటే భారీ స్థాయిలో క్రేజీ సినిమాల జాతర వుండనుందని తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని క్రేజీ పాన్ ఇండియా మూవీస్ రిలీజ్ డేట్ ని ఫిక్స్ చేసుకుని బాక్సాఫీస్ వార్ ని డిక్లేర్ చేసేశారు. మరి కొంత మంది క్రేజీ స్టార్ లు ఈ వార్ లోకి ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అవుతున్నారు. ఏ స్టార్ హీరో ఏ సినిమాతో పోటీకి దిగనున్నాడో.. ఏ రేంజ్ సినిమాలతో బరిలోకి దిగడానికి రెడీ అవుతున్నారో ఒకసారి చూద్దాం. ఇందులో ఎక్కువగా గ్యాంగ్ స్టర్ మూవీసే ఎక్కువగా వుండటం గమనార్హం.ఇందులో ప్రముఖంగా వినిపిస్తున్న ప్రాజెక్ట్ 'స్పిరిట్'. ప్రభాస్ హీరోగా 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగ దర్శకత్వం వహించబోతున్నాడు. ప్రభాస్ ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్ లతో బిజీగా వుండటం వల్ల ఆలస్యం అవుతున్న ఈ ప్రాజెక్ట్ ఈ ఏడాది చివరి నుంచి సెట్స్ పైకి వెళ్లనుంది. ప్రభాస్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా నటించనున్న ఈ మూవీ ముంబై నేపథ్యంలో సాగే గ్యాంగ్ వార్ ఫిల్మ్ అని టాక్ వినిపిస్తోంది. ఇదిలా వుంటే సందీప్ రెడ్డి ప్రస్తుతం రణ్ బీర్ కపూర్ తో రూపొందిస్తున్న'యానిమల్' కూడా గ్యాంగ్ వార్ మూవీనే అని తెలుస్తోంది.తండ్రి కోసం గ్యాంగ్ స్టర్ గా మారిన ఓ యువకుడి కథగా ఈ మూవీ వుంటుందని తెలుస్తోంది. రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీలోని కీలక పాత్రల్లో అనిల్ కపూర్ బాబీ డియోల్ నటిస్తున్నారు. అర్జున్ రెడ్డి ఫేమ్ హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నఈ మూవీని ఆగస్టు 11న భారీ స్థాయిలో రిలీజ్ చేయబోతున్నారు. ఇక పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తో సుజీత్ చేయబోతున్న మూవీ కూడా గ్యాంగ్ స్టర్ కథే అని ఫస్ట్ లుక్ పోస్టర్ తో తేలిపోయింది.'దే కాల్ హిమ్ ఓజీ' అనే ట్యాగ్ లైన్ తో ఈ మూవీ కూడా గ్యాంగ్ స్టర్ డ్రామా అని క్లారిటీ ఇచ్చేశారు. ఓజీ అంటే ఒరిజినల్ గ్యాంగ్ స్టర్. ముంబై జపాన్ నేపథ్యంలో సాగనుంది. వీటితో పాటు ఎర్రచందనం నేపథ్యంలో సాగే 'పుష్ప 2' కూడా గ్యాంగ్ స్టర్ మూవీనే. ఇటీవలే రెగ్యులర్ షూటింగ్ ని మొదలు పెట్టారు. డా. రాజశేఖర్ కూడా గ్యాంగ్ స్టర్ మూవీతో రాబోతున్నాడు. పవన్ సాధినేనితో రాజశేఖర్ చేస్తున్న 'మాన్స్టర్' కూడా గ్యాంగ్ స్టర్ మూవీనే. ఇదే బ్యాచ్ లో యంగ్ హీరో సందీప్ కిషన్ కూడా చేరిపోయాడు. ప్రస్తుతం సందీప్ కిషన్ నటిస్తున్న యాక్షన్ డ్రామా 'మైఖేల్'. పాన్ ఇండియా మూవీగా ఐదు భాషల్లో రిలీజ్ కాబోతోంది. విజయ్ సేతుపతి గౌతమ్ మీనన్ కీలక పాత్రల్లో నటించారు. ఇక 'విక్రమ్'తో సంచలన విజయాన్ని సొంతం చేసుకున్న లోకేష్ కనగరాజ్ తన సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా విజయ్ 67ని త్వరలో స్టార్ట్ చేయబోతున్న విషయం తెలిసిందే.ఇది గ్యాంగ్ వార్ నేపథ్యంలో సాగే మూవీ అని చెబుతున్నారు. ఫహద్ ఫాజిల్ తో పాటు సంజయ్ దత్ ఇందులోని కీలక పాత్రల్లో నటించనున్నారని కోలీవుడ్ లో ప్రచారం జరుగుతోంది. ఈ మూవీ కూడా ఈ ఏడాదే థియేటర్లలోకి రానుందట. ఇక కార్తి 'ఖైదీ 2' ఉపేంద్ర కిచ్చా సుదీప్ కలిసి నటించిన 'కబ్జ'. ఇది కూడా గ్యాంగ్ స్టర్ మూవీనే. ఇక దుల్కర్ సల్మాన్ నటిస్తున్న మలయాళ మూవీ 'కింగ్ ఆఫ్ కోత' కూడా గ్యాంగ్ స్టర్ డ్రామానే. ఈ మూవీ కూడా ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇవే కాకుండా మరి కొన్ని సినిమాలు కూడా ఇదే తరహా కథలతో ఈ ఏడాది బాక్సాఫీస్ వార్ తో థియేటర్లలో జాతర వాతావరణాన్ని సృష్టించబోతుండగం విశేషం.



# ఆర్సీబీ కెప్టెన్ విధ్వంసం.. టోర్నీలో తొలి సెంచరీ నమోదు




రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ సౌతాఫ్రికా 20 లీగ్(ఎస్ఎ20 2023) టోర్నీలో తొలి శతకంతో మెరిశాడు. లీగ్‌లో జోబర్గ్ సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న డుప్లెసిస్ కెప్టెన్‌గా జట్టును నడిపిస్తున్నాడు.(58 బంతుల్లోనే 113 పరుగులు నాటౌట్) చేసిన డుప్లెసిస్ ఇన్నింగ్స్‌లో 8 ఫోర్లు, 8 సిక్సర్లు ఉండడం విశేషం. ముందు కెప్టెన్‌గా తన బాధ్యతను నిర్వహించిన డుప్లెసిస్ ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ విధ్వంసం సృష్టించాడు.కాగా తొలిసారి జరుగుతున్న సౌతాఫ్రికా 20 లీగ్ 2023లో డుప్లెసిస్‌దే తొలి శతకం కావడం విశేషం. ఇక డుప్లెసిస్ ఈ సీజన్‌లో ఏడు మ్యాచ్‌లు కలిపి 277 పరుగులతో రెండో స్థానంలో ఉన్నాడు. తొలి స్థానంలో జాస్ బట్లర్ 285 పరుగులు(పార్ల్ రాయల్స్ జట్టు) ఉన్నాడు.మంగళవారం వాండరర్స్ వేదికగా డర్బన్ సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్ జరిగింది. మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన డర్బన్ సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసెన్(48 బంతుల్లో 65 పరుగులు) టాప్ స్కోరర్‌గా నిలవగా.. హోల్డర్ 28, కైల్ మేయర్స్ 28 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన జోబర్గ్ సూపర్ కింగ్స్ డుప్లెసిస్ ధాటికి 19.1 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్ రీజా హెండ్రిక్స్ 45 పరుగులతో రాణించాడు.ఇక గతేడాది ఐపీఎల్‌లో డుప్లెసిస్ ఆర్సీబీకి కెప్టెన్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**